E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 02-06-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:150|| పేజీలు–6 www.ekaburu.com



## రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

03



02

## ముప్పు వాటిల్లనివ్వం

- మా గడ్డపై భారత వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగనివ్వం
- ప్రధాని మోదీకి మయన్మార్ అధ్యక్షుడు యూమిన్ ఆంగ్ హామీ
- ఢిల్లీలో ఇరునేతల ద్వైపాక్షిక చర్చలు



# జూన్ 15 డెడ్‌లైన్

- ఆ లోపు పంటలు కొనకపోతే కేంద్రంతో యుద్ధమే: సీఎం రేవంత్‌రెడ్డి
- మద్దతు ధర ప్రకటించడమే కాదు, వాటిని కొనుగోలు చేయాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి,మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ స్పందించట్లే...
- నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష కోసం నేను ఎవరినీ లెక్క చేయను
- రెండో విడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం
- గుడిసెలు లేని ఆదిలాబాద్‌ను చేస్తాం.. ప్రాణహిత కట్టి తీరుతాం
- ఆసిఫాబాద్ జిల్లా ప్రజాపాలన–ప్రగతి బాట
- బహిరంగ సభలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

ఈకబురు, మంచిర్యాల:
జూన్ 15 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన వడ్లు, మొక్కజొన్నలు, పొద్దుతిరుగుడు పంటలు కొనకపోతే కేంద్రంతో యుద్ధం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో 67 లక్షల క్వింటాళ్ల వడ్లను సేకరించామని, ఇంకా 15 లక్షల క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని, వాటన్నింటినీ సేకరిస్తామని, మొత్తం 75 లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటామన్నారు. సోమవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి పంచాయతీ కొత్తగూడలో ఇందిరమ్మ ఇళ్లను రేవంత్ ప్రారంభించారు. మొదటి విడతలో పూర్తయిన లక్ష ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. రెబ్బెన మండలం కొండపల్లి శివారు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించిన 'ప్రజాపాలన-ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు

మిగతా 2లో

## జేఈఈ అడ్వాన్స్‌డ్.. టాప్‌టెన్‌లో నలుగురు

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ తెలుగు విద్యార్థుల దూకుడు
- రెండు వేల లోపు ర్యాంకుల్లో 284 మంది
- వంద పర్సంటైల్‌లోనూ మెజారిటీ
- జాతీయ టాపర్ ఢిల్లీ విద్యార్థి శుభమ్ కుమార్.. నేటి నుంచి జోసా



02



## ఓట్లేసి గెలిపించిన ప్రజల రుణం.. అభివృద్ధి చేసి తీర్చుకుంటా!

03

## సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తులు



మిగతా 3లో

## ఆంధ్రా ప్రజలతో మాకు ఎలాంటి ఇబ్బంది లేదు

- సమస్యంతా ఆంధ్రా రాజకీయ నాయకులతోనే
- అధికారంలోకి రాగానే ఆంధ్రా నాయకుల విగ్రహాలు పార్సల్ పంపుతాం
- మా అస్తిత్వంపై దాడి చేస్తూ మీ సంస్కృతి రుద్దుతామంటే ఊరుకోం
- పీవీ, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాలను అమరావతి లో పెడతారా?
- మన సీఎం ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్
- రాజధాని కట్టటం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు
- తెలంగాణ ఇస్తే 11 రోజులు అన్నం మానేసి పవన్ కళ్యాణ్ కు ఇక్కడేం పని?
- తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు - సాధన రౌండ్ టేబుల్ సమావేశం లో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



02



# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

- నంద్యాలలో వైఎస్ విగ్రహం ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే
- విద్వేషాలు రగిల్చేలా వైసీపీ వివాదాలు సృష్టిస్తోంది
- సంక్షేమంలో ప్రజా ప్రభుత్వానికి సాటి లేదు
- కూటమి వచ్చినప్పటి నుంచి రూ.65,887 కోట్ల మేర పెన్షన్ల పంపిణీ
- పీఎం సేతు ద్వారా ఏపీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- విశాఖ రైల్వే జోన్ తో రాష్ట్ర ప్రజల కల సాకారం
- తుని పేదల సేవలో కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**ఈ-కబురు, ,తుని, జూన్ 01:**

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకం కలిగిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా వైసీపీ కుట్రలకు, కుతంత్రాలకు పాల్పడుతోందని సీఎం అన్నారు. ఈ అంశాన్ని ప్రజలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన కొన్ని ఘటనల్ని ప్రస్తావిస్తూ వైసీపీ నేతల డ్రామాలను ఎండగట్టారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజా వేదిక సభకు హాజరై ప్రసంగించిన సీఎం వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రజల ముందు ఉంచారు. ఆ పార్టీ నేతలు ఫ్రస్ట్రేషన్ తో ప్రతీ అంశాన్నీ వివాదం చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రీ పగలు శ్రమిస్తున్నాం. వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగిస్తోంది. సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు కుతంత్రాలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని హత్యచేసి తొలుత గుండెపోటు అన్నారు. గొడ్డలితో నరికి చంపి డ్రామాలు ఆడారు. ఒక్క ఛాన్స్ అని మోసం చేసి కోడికత్తి, గులకరాయి నాటకాలు వేశారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనల్ని ప్రజలు తెలుసుకోవాలి. పాలన వైకుంఠపాళి కాకూడదన్నదే మా విజ్ఞప్తి. గత పాలకులు ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే 241 కోర్టు కేసులు పరిష్కరించాకే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. గతంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఎగ్గొట్టారు. మేం వచ్చాకే జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. అత్యంత పటిష్టంగా టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాం. కంప్యూటర్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియ జరిగింది. 40 వేల ప్రశ్నలు, 25 రకాల ప్రశ్నాపత్రాలతో ఎక్కడా అక్రమాలు జరగకుండా భర్తీ ప్రక్రియ నిర్వహించాం.

మిగతా 2లో

## తప్పు సీబీఎస్ఈ చేస్తే శిక్ష విద్యార్థులకా?

- కేంద్ర మాధ్యమిక విద్యామండలి (సీబీఎస్ఈ)లో జేబుదొంగలున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ సంస్థ చేసిన తప్పిదానికి శిక్ష విద్యార్థికి పడుతోందని, కేంద్రం లాభం గడిస్తోందని విమర్శించారు.



03



## ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: కేసీఆర్

03

## ఐసీసీ కొత్త రూల్స్..

### మ్యాచ్‌ల మధ్యలో టీమ్‌ను కోచ్‌లు కలవచ్చు


అంతర్జాతీయ క్రికెట్‌లో మార్పులు చేసేందుకు ఐసీసీ (ICC) శ్రీకారం చుట్టింది. టెస్టులను మరింత ఆకర్షణీయంగా మార్చేలా ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో ఐసీసీ క్రికెట్ కమిటీ ఛైర్మన్ సౌరభ్ గంగూలీ కూడా పాల్గొన్నారు.

International Cricket Council

06

## జేఈఈ అడ్వాన్స్‌డ్..

# టాప్‌టెన్‌లో నలుగురు



ఈకబురు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో తెలుగు విద్యార్థులు దూకుడు ప్రదర్శించారు. మొదటి పది ర్యాంకుల్లో మద్రాస్ జోన్ పరిధిలో రాసిన ముగ్గురు, బాంబే జోన్ నుంచి రాసిన మరొకరు... మొత్తంగా నలుగురు టాప్-10లో విజేతలుగా నిలిచారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మోహిత్ శేఖర్ శుక్లా (319 మార్కులు) 4వ స్థానం, కూచి సందీప్ (విశాఖ) (318 మార్కులు) 5వ స్థానం, మేడిశెట్టి నాగ సహర్ష (312 మార్కులు) 9వ స్థానం పొందారు. ఐఐటీ-బాంబే నుంచి పరీక్ష రాసిన మరో తెలుగు విద్యార్థి జయకృష్ణ శ్రీనివాస్ 6వ ర్యాంకు సాధించారు. ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన శుభమ్ కుమార్ 360 మార్కులకు 330 సాధించి ఆలిండియా టాపర్‌గా నిలిచాడు.

బాలికల విభాగంలో ఐఐటీ ఢిల్లీకే చెందిన అరోహి దేశ్‌పాండే జాతీయ టాపర్‌గా చోటు దక్కించుకుంది. అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలను అధికారులు సోమవారం విడుదల చేశారు. దేశంలో 23 ఐఐటీల్లో బీటెక్‌లో ప్రవేశానికి ఐఐటీ-రూర్కీ మే 17న దేశవ్యాప్తంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించింది. జేఈఈ మెయిన్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేశారు. వీరిలో బీటెక్, బీఆర్క్ రెండు పేపర్లకు కలిపి 1,87,389 మంది అడ్వాన్స్‌డ్ రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. 1,79,694 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తంగా 56,880 మంది అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించారు. బాలురులో 46,773 మంది అర్హత సాధిస్తే, బాలికల్లో 10,107 మంది అర్హత సాధించారు. ట్రాన్స్‌జెండర్ ఒకరు పరీక్ష రాయగా, అర్హత పొందలేదు.

మనోళ్లలో 10 మందికి 100 పర్సంటైల్

తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల్లో ఓబీసీ-ఎన్‌సీఎల్-పీడబ్ల్యూడీ విభాగంలో ఐఐటీ మద్రాస్ జోన్‌కు చెందిన నానాల నాగచైతన్య, జనరల్ ఈడబ్ల్యూఎస్‌లో బి.జయకృష్ణ శ్రీనివాస్ టాపర్లుగా నిలిచారు. మద్రాస్ జోన్ నుంచి వెల్దుర్తి హర్షిత్ 15వ ర్యాంక్, భువనేశ్వర్ జోన్ నుంచి రెడ్డి సాయిసాహితి 230 ర్యాంక్ పొందారు. జాతీయ స్థాయిలో 26 మందికి వంద పర్సంటైల్ రాగా.. వారిలో తెలుగు తేజాలు 10 మంది ఉన్నారు. 2 వేల లోపు ర్యాంకులు దక్కించుకున్న వారిలో 284 మంది మంది తెలుగువారే. 100 పర్సంటైల్ వచ్చిన వారిలో తెలుగు విద్యార్థులు మంథా శివ కామేశ్, దొరనాల భవితేశ్‌రెడ్డి, సాయి రిత్విక్ రెడ్డి, వివాన్ శరద్ మహేశ్వరి, రిషిప్రేమ్‌నాథ్, జొన్నల రోషన్ మణిదీప్‌రెడ్డి, నరేంద్రబాబుగారి మహిత్, తుంగా దుర్గా సుప్రభాత్, పసల మోహిత్, బిజ్జం వెంకట చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

**అత్యధికంగా ఐఐటీ–బాంబే నుంచి..**

జోన్ల వారీగా చూస్తే ఐఐటీ బాంబే నుంచి అత్యధికంగా 12,389 మంది అర్హత సాధించారు. ఆ తర్వాత ఐఐటీ మద్రాస్ 14,294, ఐఐటీ ఢిల్లీ 10,697, ఐఐటీ రూర్కీ 5,637, ఐఐటీ కాన్పూర్ 5,552, ఐఐటీ భువనేశ్వర్ 5,428, ఐఐటీ గౌహతి 2,883 మంది ఉన్నారు. టాప్-100లో ఐఐటీ మద్రాస్ నుంచి 35 మంది, ఢిల్లీ 29, బాంబే 23, రూర్కీ నుంచి 9 మంది, కాన్పూర్ నుంచి ముగ్గురు, భువనేశ్వర్ నుంచి ఒకరు ఉన్నారు. టాప్-100లో దాదాపు 30 మంది తెలుగు విద్యార్థులు వివిధ జోన్లలో మంచి ర్యాంకులు సాధించారు. జూన్ 2 నుంచి జోసా కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయి.

# ముప్పు వాటిల్లనివ్వం



ఈకబురు,న్యూఢిల్లీ: తమ భూభాగాలను భారత వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డాగా మారనివ్వబోమని మయన్మార్ అధ్యక్షుడు యూమిన్ ఆంగ్ హ్లేయింగ్ పునరుద్ఘాటించారు. ఐదురోజుల భారత పర్యటన నిమిత్తం యూమిన్ సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. మయన్మార్ పార్లమెంటరీ ఎన్నికల్లో గెలిచి అధ్యక్షపీఠాన్ని అధిరోహించిన రెండు నెలలకే ఆయన భారత్‌లో పర్యటనకు రావడం విశేషం. ‘‘భారత భద్రతా ప్రయోజనాలకు విఘాతం కల్గించే కార్యకలాపాలకు మయన్మార్‌ను నెలవు కానివ్వం.

పొరుగుదేశంతో మిత్రత్వం మాకు ముఖ్యం’’అని భారత ప్రధాని మోదీతో భేటీలో హ్లేయింగ్ స్పష్టంచేశారు. మోదీ, హ్లేయింగ్‌లో ద్వైపాక్షిక సమావేశం వివరాలను తర్వాత భారత విదేశాంగ శాక కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాతో పంచుకున్నారు. ‘‘ఏళ్ల తరబడి జుండా సైనికపాలన తర్వాత మయన్మార్‌లో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వం ఏర్పడింది.

ఈ నేపథ్యంలో హ్లేయింగ్ మోదీతో వాణిజ్యం మొదలు రక్షణ, సరిహద్దు భద్రత, అభివృద్ధిలో తోడ్పాటు, ఇంధనం, పెట్టుబడులు, వైద్యం, విద్య, కృత్రిమమేధ వంటి సంక్లిష్ట సాంకేతికతలో పరస్పర సహకారంపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మయన్మార్ సార్వభౌమత్వం, అంతర్గత సమగ్రతకు భారత్ కట్టుబడిఉంది. మయన్మార్‌లో నెలకొంటున్న శాంతియుత వాతావరణంపైనా మోదీ ఆరాతీశారు’’అని మిస్రీ తెలిపారు. ‘‘1,640 కిలోమీటర్ల మేర సరిహద్దు పంచుకుంటూ మయన్మార్ భారత్‌కు వ్యూహాత్మకమైన పొరుగుదేశంగా కొనసాగుతోంది. పరస్పర ప్రయోజనాలు, ప్రాంతీయాభివృద్ధి, శ్రేయస్సే పరమావధిగా ఇరుదేశాలు ఇకమీదటా కలిసి ముందుకు సాగాలని నిర్ణయించుకున్నాయి’’అని మిస్రీ పేర్కొన్నారు.

# జూన్ 15 డెడ్‌లైన్



ఈకబురు, మంచిర్యాల: జూన్ 15 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన వడ్లు, మొక్కజొన్నలు, పొద్దుతిరుగుడు పంటలు కొనకపోతే కేంద్రంతో యుద్ధం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో 67 లక్షల క్వింటాళ్ల వడ్లను సేకరించామని, ఇంకా 15 లక్షల క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని, వాటన్నింటినీ సేకరిస్తామని, మొత్తం 75 లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటామన్నారు. సోమవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి పంచాయతీ కొత్తగూడలో ఇందిరమ్మ ఇళ్లను రేవంత్ ప్రారంభించారు. మొదటి విడతలో పూర్తయిన లక్ష ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ఆవిష్కరించారు. రెబ్బెన మండలం కొండపల్లి శివారు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించిన ‘ప్రజాపాలన-ప్రగతిబాట’ బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. సోమవారం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాక సభలో మాట్లాడారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై రేవంత్ విరుచుకుపడ్డారు. కేంద్రమంత్రి ప్రల్హాద్ జోషీ పంజాబ్, హరియాణాకు ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. జూన్ 15లోపు ధాన్యం సేకరణ పూర్తవుతుందని, అన్ని పంటలను మద్దతు ధరతో కొనాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీ ఆఫీసు ముందు ధాన్యాన్ని పోస్తామని హెచ్చరించారు. కేంద్రంతో యుద్ధమే ప్రకటిస్తామన్నారు. తెలంగాణ రైతుల పక్షాన పోరాటం చేసి మీ సంగతి తేలుస్తామని హెచ్చరించారు. కిషన్‌రెడ్డి తెలంగాణలో తిరగడానికి సమస్య అవుతుందన్నారు. సత్రంలో పెట్టే ఉచిత భోజనానికి నెల్లూరి పెద్దారెడ్డి సిఫారసు తీరుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారని, కేంద్రం కొనుగోలు చేసేలా ఆయన బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు భూ సేకరణకు 1500 ఎకరాలు కోసం చర్చిద్దామని లేఖ రాస్తే కిషన్‌రెడ్డి నుంచి ఇప్పటికీ స్పందన లేదన్నారు. బస్సుయాత్ర పేరుతో బీజేపీ నాయకులు రైతుల వద్దకు వెళ్లడం కాదని దుయ్యబట్టారు.

ఎవరినీ లెక్కచేయను

నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల రైతాంగం హక్కులు, సమస్యలే ముఖ్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వారి కోసం ఎవరినీ లెక్కచేయని స్పష్టం చేశారు. ఏదైనా నేను మొదట పరిష్కారం చేసుకోవాలని చూస్తానని, అలా కాకపోతే పంచాయతీ పెట్టుకోవడానికి సిద్ధమేనని హెచ్చరించారు. తెలంగాణ అంటే ఎందుకు అంత చిన్నచూపని ప్రశ్నించారు. మహారాష్ట్ర సీఎంను ఒప్పించేందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించకపోగా, మీ ఆలోచన ఏంటని ప్రశ్నించారు. ప్రాణహితపై బరాజ్ కట్టి ఎల్లంపల్లి గ్రావిటీతో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల రైతాంగానికి లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి తీరుతామని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్లను విడిచిపెట్టి, కాళేశ్వరం కడితే కూళేశ్వరంగా మారిందన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ అంతర్రాష్ట్ర నదీ జలాలు పరిష్కారం చేసుకోవాలని చెబుతున్నారని, అయితే మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సహకరించడం లేదన్నారు. ఏడు మండలాలను ఏపీలో కలిపి లక్షలాది మందికి అన్యాయం చేశారని చెప్పారు. తాము మనుషులు, ఊళ్లను అడగం లేదని, కేవలం భూమి అడుగుతున్నామని చెప్పారు.

రెండో విడత రెండున్నర లక్షల ఇళ్లు

రాష్ట్రంలో మొదటి విడత 4.50 లక్షల ఇళ్లకు అదనంగా గూడేలకు 21వేలు అదనంగా ఇచ్చాం. లక్ష ఇళ్లకు గృహ ప్రవేశాలు చేస్తున్నాం. ఇంకా ఇళ్లు రాని వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రెండో విడతలో అందరికీ ఇళ్లు వచ్చేలా 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 15 నాటికి మరో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గతంలో ఇల్లు వచ్చిన వారికి భాగస్వామ్యం చేసి అందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. పేదవారి ఆత్మగౌరవాన్ని పెంచే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి తీరుతామన్నారు. గిరిజనులు తమకు ఆత్మగౌరవంగా బతికేందుకు ఇళ్లు ఇవ్వాలని కోరారని చెప్పారు.

అంతకుముందు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వివేక్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు, పాల్వాయి హరీశ్‌బాబు, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, వంశీక్రిష్ణ, ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, హౌసింగ్ శాఖ అధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని కెరమెరి మండలం కొఠారి గ్రామపంచాయతీ కొత్తగూడలో లబ్ధిదారులు సిడాం కన్నిబాయి, ఆత్రం పోచుబాయి, టేకం పగ్గబాయి ఇందిరమ్మ ఇళ్లను సర్పంచ్ మడావి శంతాబాయితో కలిసి ప్రారంభించారు. కాసేపు నేలపైనే కూర్చుని లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈ పర్యటనలో ఆరు సబ్‌స్టేషన్లు, రెబ్బెన మండలం నంబాలలో 2 మెగావాట్ల సోలార్‌ప్లాంట్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో మొత్తం రూ.112.14కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

గుడిసెలు లేని ఆదిలాబాద్‌ను చేస్తాం

గుడిసెలు లేని ఆదిలాబాద్‌ను చేస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది వరకు అవసరమైన ప్రతీ ఒక్కరికి ఇంటిని మంజూరు చేస్తామన్నారు. ఇందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా అధికారులతో వివరాలు తీసుకుని ఇవ్వాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో అర్ధంతరంగా ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో వివక్ష లేని పాలన అందిస్తున్నామని తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెలు ఉన్న చోట్ల కూడా ఇందిరమ్మ ఇళ్ల వివరాలు ఇవ్వాలని సిర్పూర్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలను కోరారు. ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ లేదని, మంచిర్యాలలో ఏర్పాటు చేయాలని, ఆసిఫాబాద్ జిల్లా మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుపెట్టాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కోరారు.

మీ పిల్లల్ని చదివిస్తామని మాటివ్వండి..

‘ఉచిత విద్యుత్, బస్సు, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు సౌకర్యాలన్నీ కల్పిస్తాం. కానీ ప్రతిఫలంగా నేను మీ నుంచి ఆశిస్తున్నది ఒక్కటేనని అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదివాసీ మహిళల్ని అడిగారు. ‘మీరు ఒక పూట ఉపవాసం ఉన్నా సరే మీ పిల్లలను మాత్రం చదివించాలని కోరుతున్నా.. చదివిస్తామని మాట ఇవ్వండి అని ఆదివాసీ మహిళలను కోరారు. చదువు ఒక్కటే మార్పు తెస్తుందన్నారు. కొత్తగూడలో 25 ఇళ్లు పూర్తికాగా వాటిని పరిశీలించారు.

# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

. ఒక్క ఛాన్స్ అని మోసం చేసి కోడికత్తి, గులకరాయి నాటకాలు వేశారు. ఇటీవల జరిగిన కొన్నిఘటనల్ని ప్రజలు తెలుసుకోవాలి. పాలన వైకుంఠపాళి కాకూడదన్నదే మా విజ్ఞప్తి. గత పాలకులు ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే 241 కోర్టు కేసులు పరిష్కరించాకే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. గతంలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఎగ్గొట్టారు. మేం వచ్చాకే జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. అత్యంత పటిష్టంగా టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాం. కంప్యూటర్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియ జరిగింది. 40 వేల ప్రశ్నలు, 25 రకాల ప్రశ్నాపత్రాలతో ఎక్కడా అక్రమాలు జరగకుండా భర్తీ ప్రక్రియ నిర్వహించాం. ఫ్రస్టేషన్ లో ఉన్న వైసీపీ దీనిని కూడా వివాదం చేసి రాజకీయ లబ్ది పొందాలని ఆలోచన చేసింది. సమాజంలో అశాంతిని రేపాలని ప్రయత్నాలు జరిగాయి. జాగ్రత్తగా ఉండబట్టే గట్టిగా సమాధానం ఇవ్వగలిగాం. పరామర్శలకు వెళ్తూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లోకి విసిరేసి పోయారు. కడపకు చెందిన ఓ పాస్టర్ ను పంపి హత్యాయత్నం అంటూ డ్రామాలు ఆడారు. దానిని మా పార్టీ పై నెట్టేందుకు ప్రయత్నించారు. పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ ప్రమాదంలో చనిపోతే దానిని కూడా మాకు అంటగట్టాలని ప్రయత్నాలు జరిగాయి. సీసీ కెమెరాల సాయంతో ఈ కుట్రలను బట్టబయలు చేయగలిగాం. తిరుమలలోని కౌస్తుభం గెస్ట్ హౌస్ దగ్గర సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లను పారేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నం చేశారు. సాక్షాత్తూ కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని అప్రతిష్ట పాల్జేసేందుకు ప్రయత్నం చేసిన వారిని ఏమనాలి. వారిది వేరే మతం కావొచ్చు. దానికి మేం తప్పు పట్టటం లేదు. కానీ కుట్రలతో హిందూ దేవాలయాలపై దాడులు, అపవిత్రం చేసే కుట్రలు సరికాదని హెచ్చరిస్తున్నాను. కడపలో పెద్ద దస్తగిరిని వైసీపీ వారే ఆస్తుల వివాదంలో హత్యచేసి టీడీపీ వారిపై నెట్టేందుకు ప్రయత్నం చేశారు. నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే. వైసీపీ వాళ్లే ధ్వంసం చేశారు కాబట్టే సాక్షి పత్రికలో ఆ వార్తే రాయలేదు. కాకినాడలోనే వైసీపీ ఎమ్మెల్సీ దళితుడైన డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేశారు. కానీ వైసీపీ ఆ ఎమ్మెల్సీకి సన్మానాలు చేసింది. రాజకీయ పార్టీగా ఈ తప్పిదాలు సరిచేసుకోకుండా ఎదురు దాడి చేస్తున్నారు. కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతున్నవారి ఆటలు సాగనీయం. "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**రెండేళ్ల క్రితం విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి**

"విధ్వంసం నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా జూన్ 4 తేదీ చరిత్రలో నిలిచిపోతుంది. గత పాలన అంతా విధ్వంసకర పాలన, బహిరంగంగా నవ్వాలని అనుకున్నా ప్రజలంతా భయపడే పరిస్థితి. ప్రజలు వెళ్లి పోకుండా కందకాలు తవ్వి, ఫెన్సింగ్ లు వేసి మరీ సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. దానికి నిదర్శనం పింఛన్ల పెంపు. రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలు ఉన్నా...పెన్షన్లు ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4 వేలు చేశాం. దివ్యాంగులకు రూ.6,000 చేశాం. హెల్త్ పెన్షన్లు రూ.10 వేలకు, రూ.15 వేలకు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో అందించాం. ఏడాదికి దాదాపు రూ.32 వేల కోట్లు ఈ ఒక్క పథకానికే ఖర్చు పెడుతున్నాం. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో, ఇంత ఎక్కువ మందికి పింఛన్లు ఇవ్వడం లేదు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం ఉంటుంది తప్ప ప్రజలను కలిసి వారి కష్ట సుఖాలు తెలుసుకునే పరిస్థితి ఉండదు. అందుకే ప్రతీ నెలా 1 తేదీన ప్రజలను నేరుగా కలుసుకుని పెన్షన్లు అందిస్తున్నాం. రాష్ట్రంలో 62.34 లక్షల మందికి, రూ.2,729 కోట్లు పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నాం. ఈనెల కొత్తగా మరో 5,606 మందికి రూ.2.24 కోట్లు స్పౌజ్ పెన్షన్ల కోసం మంజూరు చేశాం రాష్ట్రంలో చాలా మంది పేద కుటుంబాలకు 24 సంక్షేమ పథకాలు అందుతున్నాయి. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్ సేవలో, మత్స్యకారుల సేవలో ఇలా వేర్వేరు పథకాలు వస్తున్నాయి. ఈ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు పెంచాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించేలా చర్యలు చేపట్టాం. 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు కూడా మన యువతకు వస్తాయి. మన రాష్ట్ర యువత ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా పరిశ్రమలు తెస్తున్నాం. కాకినాడ సమీపంలో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమను రూ.80 వేల కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. తుని పక్కనే అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ ఓ స్టీల్ సిటీని ఏర్పాటు చేస్తోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరుతున్నాం. పీఎం సేతు కింద యువతకు స్కిల్ డెవలప్మెంట్ చేస్తున్నాం. ఏడాదికి 25 వేల మంది యువతకు శిక్షణను పీఎం సేతు కింద ఇస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ కేంద్ర సహకారంతో తిరిగి పునరుద్ధరించాం. అలాగే విశాఖ రైల్వే జోన్ కల కూడా సాకారమైంది." అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**ఆదర్శవంతమైన రాష్ట్రంగా ఏపీ**

"పేదలకు విద్య, వైద్యంలో అత్యంత నాణ్యమైన సేవలు అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్య కోసం పాఠశాలల్లో సంస్కరణలు తీసుకువచ్చాం. పాఠ్యాంశాలు మారుతున్నాయి. నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులు చేయకుండా యూనివర్సల్ హెల్త్ పాలసీ కూడా తీసుకువస్తున్నాం. సంజీవని పేరిట వ్యక్తిగత ఆరోగ్యం కోసం డిజిటల్ హెల్త్ రికార్డులను రూపొందించి పర్యవేక్షిస్తాం. మెరుగైన జీవితాన్ని ప్రజలకు అందించేలా ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో సంజీవని అమలు చేస్తాం. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేలా ప్రజా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది కూడా జూన్ లో యోగాంధ్ర కార్యక్రమాన్ని కూడా అమరావతి లో నిర్వహిస్తున్నాం.14 రోజుల పాటు నిర్వహించే యోగాలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిస్తున్నాను. వ్యాయామం, యోగా, మెడిటేషన్ లాంటివి చేస్తే మన ఆరోగ్యాన్ని మనమే పరిరక్షించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ను ఆదర్శవంతమై రాష్ట్రంగా తీర్చిదిద్దేలా 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపొందించాం. ప్రజలకు అందించే ప్రతీ పౌర సేవా సక్రమంగా, నాణ్యంగా అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి వరకూ విశాఖ రీజియన్ గా పశ్చిమగోదావరి నుంచి ప్రకాశం వరకూ అమరావతి రీజియన్ గా తిరుపతి కేంద్రంగా రాయలసీమ రీజియన్ ను అభివృద్ధి చేస్తున్నాం. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మనపై పడింది. ఈసారి ఎల్ నినో కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. దీనికి మనం అంతా సన్నద్ధం కావాలి. సమర్థ నీటి నిర్వహణతో ముందుగానే కాలువలకు నీళ్లు ఇవ్వగలిగాం. 2027 గోదావరి పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాది జూలై లోగా పోలవరం ఎడమ కాలువ పూర్తి చేసి విశాఖ వరకూ నీరు తీసుకెళ్తాం. మత్స్యకార మహిళలకు సీవీడ్ ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు చేస్తున్నాం. మన మత్స్యకారులకు రూ.240 కోట్లతో 200 మెకనైజ్డ్ బోట్లు సబ్సిడీపై అందిస్తాం. అమినాబాద్ ఫిషింగ్ హార్బర్ కోసం రూ.80 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తాం. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4**

కాకినాడ జిల్లాలో పౌరసేవలు సంతృప్తిగా అందించిన ప్రభుత్వ యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు సేవలు అందించాలని సీఎం సూచించారు. పేదల సేవలో కార్యక్రమంలో పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులు బంగారు కుటుంబాలతో సీఎం మాట్లాడారు. పేదరికం లేని సమాజాన్ని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని అన్నారు. బంగారు కుటుంబాల్లో విద్యాధికులుగా, ఆదాయం ఆర్జించే వ్యక్తులుగా మారాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం వివరించారు. అనంతరం సభావేదిక వద్ద తన అభిమాని అయిన దివ్యాంగ యువకుడిని ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించారు. అతని భుజంపై చేయి వేసి ఫోటో దిగారు. ప్రభుత్వం తరపున ఆ దివ్యాంగ యువకుడికి సహకారం అందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ను సీఎం ఆదేశించారు. ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ ఉద్యాన పంటల సాగు మైక్రో న్యూట్రియంట్స్ తో పాటు ప్రకృతి సేద్యం దిశగా కృషి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

# ఆంధ్రా ప్రజలతో మాకు ఎలాంటి ఇబ్బంది లేదు

ఈ కబురు ,హైదరాబాద్:

తెలంగాణ అమరుల ఆకాంక్షలు, ఉద్యమకారుల పోరాటం ఫలితంగా ఏర్పడిన తెలంగాణపై ఆంధ్రా నాయకుల పెత్తనాన్ని సహించబోమని టీఆర్ఎస్ ఛీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జరిగిన "ఉద్యమకారుల ఆకాంక్షలు సాధన" పై రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత మాట్లాడారు. తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ ఎలాంటి విబేధాలు లేకుండా కలిసే ఉన్నారని గుర్తు చేశారు. కానీ రాజకీయ నాయకులే తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తూ పెత్తనం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వాన్ని తెలంగాణ రక్షణ సేన మాత్రమే కాపాడుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి రాగానే ఇక్కడ ఉన్న ఆంధ్రా నేతల విగ్రహాలను ఆంధ్రాకు పార్సల్ చేస్తామని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణలో ఆంధ్రా రాజకీయ నేతల ఏజెంట్ సీఎంగా ఉండటంతో మళ్లీ ఈ ప్రాంతంలో కుట్రలు మొదలు పెట్టారని విమర్శించారు. ఆంధ్రాలో 12 ఏళ్లు గడిచిన రాజధాని నిర్మాణం చేతకాక ప్రజల అటెన్షన్ డైవర్ట్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. మన అస్తిత్వం పై దాడి చేస్తూ వారి సంస్కృతిని రుద్దుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తెలంగాణ తల్లి మీద కన్నేస్తే ఊరుకునే తెలంగాణ కాదన్నారు. తమతో పెట్టుకున్న వాళ్లెవరు బాగుపడలేదని...ఇప్పటికే ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ సాధించుకున్నామని గుర్తు చేశారు. మళ్లీ తమతో పెట్టుకుంటే పళ్లు రాలుతాయని హెచ్చరించారు. టీఆర్ఎస్ 2.0 అంటే ఎలా ఉంటుందో చూపిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో ఆంధ్రా నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేస్తుండటంపై టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కచ్చితంగా తమ అస్తిత్వంపై దాడియే అన్నారు. తమతో పెట్టుకుంటే గతంలో తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తు చేశారు. మరోసారి తమ జోలికి వస్తే ఈసారి పళ్లు రాలగొడతామని హెచ్చరించారు. టీఆర్ఎస్ 2.0 ఎలా ఉంటుందో చూపిస్తామన్నారు. తెలంగాణ లో ఏర్పాటు చేస్తున్నఆంధ్రా నాయకుల విగ్రహాలను తమ పార్టీ అధికారంలోకి వచ్చాక పగలకొట్టి మరీ పార్సిల్ చేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రజలు ఎంతో సహన శీలురుని... అందుకే ఇప్పటికీ కూడా ఆంధ్రా నాయకుల విగ్రహాలు ఇక్కడ ఉన్నప్పటికీ గౌరవిస్తున్నామన్నారు. కానీ శృతి మించితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కవిత హెచ్చరించారు. తెలంగాణలో ఆంధ్రా నాయకుల విగ్రహాలు పెడుతున్నట్లుగానే ఆంధ్రాలో తెలంగాణ నాయకుల విగ్రహాలు పెడతారా అని ప్రశ్నించారు. పీవీ, ప్రొఫెసర్ జయశంకర్ సార్ సహా తెలంగాణ అమరవీరుల విగ్రహాలు పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా రాజకీయ నేతల ఏజెంట్ అని కవిత ఆరోపించారు. ఆయన సహకారంతోనే తెలంగాణపై ఆంధ్రా నాయకులు కుట్రలు చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన మొదట్లో ఈ ప్రాంతం గురించి మాట్లాడాలంటే భయపడే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. కానీ ఎప్పుడైతే రేవంత్ రెడ్డి సీఎం అయ్యారో అప్పటి నుంచి మళ్లీ కుట్రలు మొదలయ్యాయన్నారు. తెలంగాణ మేధావులు ప్రొఫెసర్ నాగేశ్వర్, పాశం యాదగిరి లాంటి వాళ్లు తమ విశ్లేషణలు చేస్తే ఆంధ్రా పోలీసులు ఇక్కడకు వచ్చి అరెస్ట్ చేస్తామని చెప్పే ధైర్యం చేయటమేమిటనీ ప్రశ్నించారు. ఆంధ్రా ప్రజలతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని ...కానీ ఆంధ్రా రాజకీయ నాయకులతో మాత్రం సమస్య ఉందన్నారు. తెలంగాణ సెక్రటేరియేట్ లో, ఇక్కడి రాజకీయాల్లో వేలు పెడతామంటే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని కవిత తేల్చిచెప్పారు.ఆంధ్రా నాయకులకు రాజధాని నిర్మాణం చేతకాకనే అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు అవుతున్న రాజధాని నిర్మించటంలో రెండు పార్టీలు ఫెయిలయ్యాయన్నారు. దీన్ని ప్రజలను డైవర్ట్ చేయటానికి మహానాడులో తెలంగాణ వ్యక్తితోనే తెలంగాణ అనే పదం డిక్షనరీ లేదని అనిపించారని విమర్శించారు. మెడకాయ మీద తలకాయ ఉన్నోడెవడు అలా మాట్లాడడని చెప్పారు. ఇవన్నీ యాధృచ్ఛికంగా కాకుండా పథకం ప్రకారం జరుగుతున్న కుట్రలని కవిత చెప్పారు. రాజ్యాంగం తమకు తెలంగాణ ఇచ్చిందని గుర్తు చేశారు. మీ డిక్షనరీ లో తెలంగాణ ఉంటే ఎంత లేకుంటే ఎంత అంటూ ఫైర్ అయ్యారు. వానకాలం వచ్చిందంటే సెక్రటేరియేట్ లోకి నీళ్లు, రాజధాని మునిగిపోవటం అనేది ఆంధ్రా ప్రజలకు అవమానమని కవిత అన్నారు. నాయకులకు ఏదైనా అయితే వైద్యం కోసం హైదరాబాద్ కు వస్తున్నారని...కానీ ప్రజల పరిస్థితి ఏంటన్నారు. నెల్లూరు వాళ్లు చెన్నైయ్ కి, అనంతపురం వాళ్లు బెంగళూరుకు, విజయవాడ వాళ్లు హైదరాబాద్ కు రావాల్సిందేనా అని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం కోసం 80 వేల ఎకరాలు సేకరిస్తున్నారని...అదంతా రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమేనని విమర్శించారు. పాలన సౌలభ్యం కోసం కొన్ని భవనాలు నిర్మించేందుకు 80 వేల ఎకరాలు ఎందుకన్నారు. ఈ విషయంలో అవసరమైతే ఆంధ్రా ప్రజల హక్కుల కోసం పోరాడుతామని కవిత చెప్పారు. తెలంగాణలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్న పవన్ కళ్యాణ్ కు, తెలంగాణలో విస్తరిస్తామని ప్రకటించిన లోకేష్ కు కలిసి కవిత కౌంటర్ ఇచ్చారు. విస్తరించటానికి లోకేష్ బాబు ఇదేం మీ సామ్రాజ్యం కాదని చెప్పారు. అసలు ఆంధ్రా నాయకులు ఎప్పుడైనా తెలంగాకు మంచి జరగాలని కోరుకున్నారా అని కవిత ప్రశ్నించారు. టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు మన నీళ్లు దోచుకుందామని చూశారే తప్ప సమానంగా పంచుకుందాని ఏనాడైన అన్నారా అని కవిత నిలదీశారు. ఈ ప్రాంతం మీద ఏ మాత్రం ప్రేమ లేని వాళ్లు ఇక్కడ రాజకీయాలు చేస్తామంటే ప్రజలు అన్ని గమనిస్తారని చెప్పారు. తెలంగాణ తల్లి మీద కన్నేస్తామంటే ఊరుకునే ఎడ్డి తెలంగాణ ఇది కాదని కవిత స్పష్టం చేశారు. అదే విధంగా తమకు ఆంధ్రా ప్రజలతో ఎలాంటి సమస్య లేదన్నారు. తెలంగాణను దోచుకునేందుకు ప్రయత్నిస్తున్న ఆంధ్రా రాజకీయ నాయకులతోనే అసలైన సమస్య అని అన్నారు. ఆంధ్రాలో రైతులను, ప్రజలను దోచుకున్నది చాలక తెలంగాణ ను కూడా దోచుకుంటారా అని నిలదీశారు. కర్ణాటక లోనో, తమిళనాడులోనో మీ పార్టీ విస్తరించుకోవాలని తెలంగాణలో మిమ్మల్ని ప్రజలు నమ్మరని చెప్పారు. ఇక్కడి ప్రజలు మీ పార్టీలను నమ్మకపోవటంతోనే దుకాణాలు బంద్ చేసుకున్న సంగతి మర్చిపోయారా అని వారికి గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు అన్యాయం జరిగిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం వస్తుందో లేదో తెలియని సమయంలో ఎంతో మంది ప్రాణత్యాగానికి సిద్ధపడి ఉద్యమం చేశారని చెప్పారు. ఎంతో మంది ప్రాణ త్యాగంతో రాష్ట్రం తెచ్చుకున్నామని కవిత గుర్తు చేశారు. అందుకే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇప్పటి యువతకు తెలంగాణ ఉద్యమం గురించి తెలియదని చాలా మంది అంటుంటారని... కానీ వాళ్లు మనకన్నా ఉషారే ఉన్నారని చెప్పారు. 1969 లో జరిగిన ఉద్యమంలో మొట్ట మొదట అమరులయ్యింది కూడా కృష్ణ, శంకర్ అనే యువకులేనని కవిత గుర్తు చేశారు. ఆ తర్వాత కాసు బ్రహ్మానంద రెడ్డి రాక్షసత్వంతో 369 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆనాటి ఉద్యమం రాజకీయ కారణాలతో వీగిపోయిందన్నారు. ప్రజలు మాత్రం తొలి, మలి దశలో ఎంతో స్పష్టతతో ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. తొలి, మలి దశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయాల్సి ఉందన్నారు. తాము అధికారంలో వచ్చాక అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయలు ఇస్తామన్నారు. తాము పార్టీ ఏర్పాటు చేసిందే తెలంగాణ అస్తిత్వ, హక్కుల పరిరక్షణ కోసమని చెప్పారు.

# ఓట్లేసి గెలిపించిన ప్రజల రుణం..
# అభివృద్ధి చేసి తీర్చుకుంటా!

- అమీన్‌పూర్ వాసులకు నేషనల్ హైవే కనెక్టివిటీ కల్పిస్తా
- ప్రజల డిమాండ్లను నెరవేర్చడమే ప్రజాప్రతినిధి ప్రధాన లక్ష్యం
- బ్రిడ్జి పనుల పరిశీలనలో ఎంపీ రఘునందన్ రావు



లింగంపల్లి నాలా వద్ద పనులు పరిశీలిస్తున్న మెదక్ ఎంపీ మాదవనేని రఘునందన్ రావు

ఈ-కబురు, పటాన్‌చెరు :
తనకు ఓట్లేసి ఎంపీగా గెలిపించిన ప్రజల రుణం.. అభివృద్ధి చేసి తీర్చుకుంటానని, ఎన్నికలప్పుడు


అమీన్‌పూర్ – లింగంపల్లి చౌరస్తా కనెక్టివిటీ రోడ్డు విషయమై నాయకులతో మాట్లాడుతున్నఎంపీ రఘునందన్ రావుస్తున్న మెదక్ ఎంపీ మాదవనేని రఘునందన్ రావు

వారు అడిగిన డిమాండ్లను నెరవేర్చడమే తన ప్రధాన లక్ష్యమని మెదక్ ఎంపీ మాదవనేని రఘునందన్ రావు అన్నారు. సోమవారం సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల బార్డర్‌లో ఉన్న లింగంపల్లి చౌరస్తా వద్ద జరుగుతున్న నాలాపనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీహెచ్ ఈఎల్ సర్కిల్ వద్ద ఉన్న నేషనల్ హైవేకు అమీన్‌పూర్, బొల్లారం, సుల్తాన్‌పూర్ ప్రాంతాల నుండి నేరుగా కనెక్టివిటీ లేక చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని, పరిష్కార మార్గంగా లింగంపల్లి నాలా మీదుగా ఆక్రమణలను తొలగించి బందంకొమ్ము రోడ్డుకు బ్రిడ్జిని నిర్మించబోతున్నట్లు తెలిపారు. భెల్ కూడలి నుండి అమీన్‌పూర్ వైపుకు వంద ఫీట్ల రోడ్డును వేసేందుకు గతంలోనే ప్రతిపాదనలు తయారు చేశామని, అప్పటి జీహెచ్ఎంసీ కమీషనర్ కర్ణన్ కూడా క్షేత్ర స్థాయి పరిశీలన చేసి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అందులో భాగంగానే నాలాపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రస్తుతం రూ. 4 కోట్లు విడుదలయ్యాయని, త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభించి వంద రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తాని పేర్కొన్నారు. స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతనిధులు బీఆర్ఎస్ వారే అయినా గత ప్రభుత్వంలో ఈ సమస్యను పట్టించుకోలేదని, గెలిచిన కొన్ని నెలలకే చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి రోడ్డు సమస్యను పరిష్కరించామని అన్నారు. ఈ కనెక్టివిటీతో అమీన్‌పూర్ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరుతుందని, శేరిలింగంపల్లి వైపు ప్రజలకు ఓఆర్ఆర్ ప్రయాణం సులభతరం కానుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, బీజేపీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, దిశ కమిటీ సభ్యుడు కాసాల సుధాకర్ , ఎడ్ల రమేశ్ , నర్సింగ్ గౌడ్, పాండురంగా రెడ్డి, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగండ్ల డివిజన్ లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి


అధికారులకు వినతి పత్రం సమర్పిస్తున్న హరిశంకర్ యాదవ్


నల్లగండ్ల డివిజన్ డ్రైనేజీ సమస్యను అధికారులకు వివరిస్తున్న దృశ్యం

**రాగం హరిశంకర్ యాదవ్**
**అధికారులకు హరిశంకర్ యాదవ్ వినతి**

ఈకబురు, శేరిలింగంపల్లి : నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి సాయి కాలనీ, కేశవ్ నగర్ ప్రాంతాల్లో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం హరి శంకర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కొండాపూర్ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో శేరిలింగంపల్లి డీజీఎంకు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాగం హరి శంకర్ యాదవ్ మాట్లాడుతూ డ్రైనేజీ లీకేజీల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇదే సమస్యపై గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. మురుగునీటి లీకేజీల కారణంగా స్థానికంగా తీవ్రదుర్గంధంతో పాటు అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాపోయారు. రానున్న వర్షాకాలం ని దృష్టిలో ఉంచుకొని యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై స్పందించిన శేరిలింగంపల్లి డీజీఎం సాయి కాలనీ, కేశవ నగర్ ను సందర్శించి సమస్యను పరిశీలించాలని సంబంధిత మేనేజర్‌ను ఆదేశించారు. సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులను కలిసిన వారిలో హరిశంకర్ యాదవ్ తో పాటు భీమ్‌రాజ్, రవికుమార్, సాయిరామ్, అరుణ్, నరేష్, చరణ్ తదితరులు ఉన్నారు.

# స్మశాన వాటికలో కనీస వసతులు, కాలనీల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయండి


దుర్గంధంగా మారిన స్మశాన వాటికను పరిశీలిస్తున్న ఆంజనేయులు సాగర్


ప్రజావాణిలో చీఫ్ ఇంజనీర్ కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**అధికారులకు విన్నవించిన**
**ఆంజనేయులు సాగర్**

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ స్మశాన వాటిక అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించడంతో పాటు, డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఆంజనేయులు సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ శ్రీ లక్ష్మీకి వినతిపత్రం అందజేసి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ రాజీవ్ నగర్ స్మశాన వాటిక ప్రస్తుతం దయనీయ స్థితిలో ఉందన్నారు. స్మశాన వాటికలో చెత్త పేరుకుపోయి.. చెట్లు మొలిచి చిట్టడవిని తలపిస్తుందని అన్నారు. పేరుకుపోయిన చెత్త, దుర్గంధం కారణంగా ప్రజలు అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతేకాకుండా స్మశాన వాటికలో కనీస వసతులైన వీధి దీపాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడం వల్ల రాజీవ్ నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతోపాటు అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని బంజారా బస్తీ, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు దెబ్బతిని ప్రజలకు ఇబ్బందికరంగా మారాయని తెలిపారు. ఈ రహదారులు ప్రధాన రహదారులతో అనుసంధానమై ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, ఉద్యోగులు, వాహనదారులు ప్రయాణిస్తున్నారని చెప్పారు. వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరడం, ఇప్పటికే రోడ్లు అధ్వాన్నంగా ఉండటం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వెంటనే సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ సాగర్, వెంకటేష్, మురళి తదితరులు పాల్గొన్నారు

# సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తులు

ఈకబురు న్యూఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానానికి ఐదుగురు కొత్త న్యాయమూర్తులు నియమితులయ్యారు. కేంద్ర న్యాయశాఖ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వెంకట సుబ్రమణి మోహన, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్ నాగు, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా, జమ్మూకశ్మీర్, లడాఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ పల్లిలు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రమాణ స్వీకారం చేయడంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల మొత్తం సంఖ్య 37కు చేరుకుంటుంది. కేంద్ర ప్రభుత్వం గత నెలలో ఒక ఆర్డినెన్స్ ద్వారా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను చీఫ్ జస్టిస్‌తో కలిపి 34 నుంచి 38కి పెంచిన విషయం తెలిసిందే. అప్పటికే ఉన్న రెండు ఖాళీలను కలుపుకుంటే మొత్తం ఆరుగురు న్యాయమూర్తుల నియామకాలు జరగాల్సి ఉండింది. సుప్రీంకోర్టు కొలీజియం మే నెల 27న ఐదుగురు న్యాయమూర్తుల పేర్లను సిఫారసు చేయడంతో కేంద్రం వారి నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. ఫలితంగా ఇప్పుడు సుప్రీంకోర్టులో ఒకే ఒక్క న్యాయమూర్తి స్థానం ఖాళీగా ఉన్నట్లు అయ్యింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సోమవారం నియమితులైన సీనియర్ న్యాయవాది వెంకట సుబ్రమణి మోహన (59) ప్రత్యేక రికార్డు నెలకొల్పారు. బార్ నుంచి నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన రెండో మహిళా న్యాయవాది వెంకిట సుబ్రమణి మోహన కావడం విశేషం. 2018లో జస్టిస్ ఇందిరా మల్హోత్ర ఇలాగే నేరుగా సుప్రీంకోర్టుకు ఎంపికయ్యారు. 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి న్యాయ విద్యలో పట్టభద్రురాలైన మోహన ఇప్పటివరకూ ఆ నగరంలోనే వృత్తిలో కొనసాగుతున్నారు. అంతేకాదు... మోహన ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపికైన 12వ వ్యక్తి. మహిళా న్యాయమూర్తిగా జస్టిస్ బి.వి. నాగరత్న మాత్రమే ఉండగా.. తాజా నియామకంతో ఈ సంఖ్య రెండుకు చేరనుంది.

# టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన కొండా రవిగౌడ్

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై చర్చ

ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిజమైన లబ్దిదారులకు చేరవేసేందుకు కృషి : రవి గౌడ్


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో కొండా రవి గౌడ్

ఈకబురు, శేరిలింగంపల్లి : టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండా రవి గౌడ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నార్సింగిలోని మహేష్ కుమార్ గౌడ్ నివాసానికి వెళ్లిన కొండా రవి గౌడ్ ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాలతో పాటు సంస్థాగత అంశాలపై చర్చించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం వంటి అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కొండా రవి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను నిజమైన లబ్ధిదారులకు చేరవేసేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల మధ్య ఉంటూ ప్రభుత్వ పథకాలను వారికి వివరించాలని పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

ఈకబురు న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌తో సహా మొత్తం 13 రాష్ట్రాల్లోని 27 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక, ఉప ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) సోమవారం ప్రకటన జారీ చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా ఈ నెల, జులైలో ఖాళీ అవుతున్న ఆంధ్రప్రదేశ్(4), గుజరాత్(4), కర్ణాటక(4) మధ్యప్రదేశ్(3), రాజస్థాన్(3), ఝార్ఖండ్(2), మణిపుర్(1), మేఘాలయ(1), అరుణాచల్‌ప్రదేశ్(1), మిజోరం(1)ల్లోని స్థానాలకు ఈ నెల 18న పోలింగ్ నిర్వహించనున్నారు. అలాగే తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశాల్లో ముందుగానే ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు అదేరోజున ఉప ఎన్నికలు జరగనున్నాయి.
ఈ నేపథ్యంలో సోమవారం నుంచి నామినేషన్ల ప్రక్రియను ఈసీ ప్రారంభించింది. ఈ నెల 8 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ. 9న పరిశీలన, 11న ఉపసంహరణ కార్యక్రమం ఉంటుంది. ఈ స్థానాలకు ఒక్కో అభ్యర్థి మాత్రమే నామినేషన్లు దాఖలు చేస్తే అభ్యర్థులంతా ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. అప్పుడు పోలింగ్ అవసరం ఉండదు. అలాకాకుండా ఇద్దరు, అంతకుమించిన సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడితే 18న ఉదయం 9 నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ నిర్వహించి అదేరోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం వెల్లడిస్తారు.
ఏపీ రిటర్నింగ్ అధికారిగా వనితారాణి
ఏపీలో జరిగే రాజ్యసభ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా ఏపీ లెజిస్లేచర్ సెక్రటేరియట్ డిప్యూటీ సెక్రటరీ వి.వనితారాణి, సహాయ రిటర్నింగ్ అధికారులుగా రీసెర్చ్ ఆఫీసర్లు ఎం.అఖిల్‌కుమార్, పి.విజయకుమారి వ్యవహరిస్తారని కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

# తప్పు సీబీఎస్ఈ చేస్తే
# శిక్ష విద్యార్థులకా?

కేంద్ర మాధ్యమిక విద్యామండలి (సీబీఎస్ఈ)లో జేబుదొంగలున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ సంస్థ చేసిన తప్పిదానికి శిక్ష విద్యార్థికి పడుతోందని, కేంద్రం లాభం గడిస్తోందని విమర్శించారు. సమాధాన పత్రాల పునర్‌మూల్యాంకన ప్రక్రియ, విద్యార్థులు భరిస్తున్న ఖర్చు ఈ విషయాన్నే తెలియజేస్తున్నాయని ఆయన సోమవారం సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా పరిగణించినప్పుడు సమాధాన పత్రాల మూల్యాంకనంలో తప్పిదాలు పెరుగుతాయే తప్ప తగ్గవని రాహుల్ అభిప్రాయపడ్డారు. ''జేబుదొంగలు సీబీఎస్ఈలో కూర్చున్నారు. మార్కుల్లో తప్పులు దొర్లితే ఒక సబ్జెక్టుకు రూ.100, ఒక్కో పేపర్‌లో మార్కులు తిరిగి కూడటానికి రూ.100, పునర్ మూల్యాంకనానికి ఒక్కో ప్రశ్నకు రూ.25 వసూలు చేస్తారు'' అని తెలిపారు. దీనిపై ఒక వీడియోను జతచేశారు. ఒక్కో విద్యార్థి తన సమాధాన పత్రాల గురించి కచ్చితమైన మూల్యాంకనం కోసం రూ.2,000 వరకూ చెల్లించుకోవాల్సి వస్తోందని రాహుల్ పేర్కొన్నారు. దాదాపు 4 లక్షల మంది విద్యార్థులు పునర్ మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు.
అగ్ని ప్రమాదంపై కాంగ్రెస్ ఆందోళన
కేంద్ర విద్యాశాఖ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరగడంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇందులో ఏదో తిరకాసు ఉందనిపిస్తోందని సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం జరిగింది స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లోనని, విద్యాశాఖ ప్రాంగణంలో కాదని కేంద్రం వివరణ ఇచ్చింది.

# ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: కేసీఆర్



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. రాష్ట్ర ప్రజలకు భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను కేసీఆర్ ఒక ప్రకటనలో స్మరించుకున్నారు. ''తెలంగాణ ప్రజలపై దశాబ్దాలపాటు సాగిన అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి ప్రజాస్వామ్యయుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నాం. విమర్శించిన నోళ్లు మూతపడేలా పదేళ్లలో ప్రగతి పాలనను అందించాం. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుకున్నాం. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం.. తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలి. తెలంగాణ రాష్ట్ర రక్షణలో భారాస ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుంది'' అని కేసీఆర్ పేర్కొన్నారు.
ఉద్యమ స్ఫూర్తి సజీవంగా ఉండాలి: మహేశ్‌కుమార్‌గౌడ్
రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన సుదీర్ఘ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని సజీవంగా ఉంచుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పథంలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని సోమవారం ఆయనొక ప్రకటనలో ఆశాభావం వ్యక్తంచేశారు.

### ఆరంభ లాభాలు ఆవిరి..

## 508 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ట్రేడైన సూచీలు.. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీలు నష్ట పోయాయి. పశ్చిమాసియాలోని శాంతిపై అనిశ్చితి నెలకొనడం, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి.సెన్సెక్స్ ఉదయం 75,203.02 (క్రితం ముగింపు 74,775.74) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,367.93 వద్ద గరిష్ఠాలను తాకిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. చివరికి 508.40 పాయింట్ల నష్టంతో 74,267.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 165.15 పాయింట్ల నష్టంతో 23,382.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, ఇండిగో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.01 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,496 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

### మే నెలలో జీఎస్టీ వసూళ్లు

## రూ.1.94 లక్షల కోట్లు




దేశంలో వస్తు, సేవల పన్ను వసూళ్ల (GST Collections) వివరాలను సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. మే నెలలో రూ.1.94 లక్షల కోట్ల రాబడి నమోదైంది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే జీఎస్టీ వసూళ్లలో 3.2 శాతం వృద్ధి కనిపించింది. ఇక రిఫండ్ల సర్దుబాటు అనంతరం మే నెలకు నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1,66,904 కోట్లుగా ఉన్నాయి.మొత్తంగా రీఫండ్లు 2.6 శాతం పెరిగి, రూ.27,281కోట్లుగా ఉన్నాయి. దేశీయ రీఫండ్లు 4.3 శాతం తగ్గగా.. ఎగుమతి ఆధారిత రీఫండ్లు 16.6 శాతం పెరిగాయి. గతేడాదితో పోలిస్తే.. స్థూల దేశీయ జీఎస్టీ రాబడి 2.6 శాతం తగ్గింది. ఆ మొత్తం రూ.1.34 లక్షల కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వసూళ్లు 19.1 శాతం పెరిగి, రూ.59,654 కోట్లుగా ఉన్నాయి. కాగా.. ఏప్రిల్, మే నెలల్లో జీఎస్టీ (GST) వసూళ్లు 6.2 శాతం పెరిగి, 4.37 లక్షలకోట్లకు చేరాయి.

## క్రెడిట్ కార్డ్ వ్యాపారంలోకి సెంట్రల్ బ్యాంక్

### సీఈఓ, ఎండీ కల్యాణ్ కుమార్



దిల్లీ: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీజు ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో వెల్త్ మేనేజ్‌మెంట్ (సంపద నిర్వహణ), క్రెడిట్ కార్డ్ వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు బ్యాంక్ సీఈఓ, ఎండీ కల్యాణ్ కుమార్ వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు బోర్డు ఆమోదం లభించిందని తెలిపారు. ఈ వ్యాపారాన్ని ప్రారంభించేందుకు అవసరమైన నిపుణులను నియమించుకోవడానికి ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) జారీ చేసే ప్రక్రియలో ఉన్నామని తెలిపారు. వడ్డీయేతర ఆదాయాన్ని మెరుగుపరిచే ఉత్పత్తులకూ శ్రీకారం చుట్టాలని యోచిస్తున్నట్లు వివరించారు. 'కార్పొరేట్ ఖాతాదార్ల కోసం నగదు నిర్వహణ సేవలు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఆ సేవలు మా వద్ద అభివృద్ధి దశలో ఉన్నాయి. ఆగస్టు కల్లా ప్రారంభిస్తాం. మేము ఎల్‌సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్), ఎల్‌జీ (లెటర్ ఆఫ్ గ్యారెంటీ) వ్యాపారం ద్వారా కేంద్రీకృత ఫారెక్స్ అమ్మకాలను కలిగి ఉన్నాం. ఫారెక్స్ వ్యాపారాన్నీ ప్రారంభిస్తామ'ని కల్యాణ్ వివరించారు. తొలుత ఇతర బ్యాంకుల నుంచి ఈ సౌకర్యాలను పొందుతున్న తమ కార్పొరేట్ ఖాతాదార్లను లక్ష్యంగా చేసుకుంటామన్నారు.

# విమానయాన సంస్థలకు ఊరట

## .. జెట్ ఫ్యూయల్ ధర 27% తగ్గింపు



దిల్లీ: విమానయాన సంస్థలకు ఊరట కల్పిస్తూ ప్రభుత్వరంగ చమురు కంపెనీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. అంతర్జాతీయ విమానాల జెట్ ఇంధన (ATF) ధరలను 27 శాతం తగ్గించాయి. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా పెరిగిన చమురు ధరల కారణంగా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న విమానయాన సంస్థలకు రక్షణ కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. దేశీయ విమాన ఇంధన ధరల్లో మాత్రం వరుసగా రెండో నెలా ఎలాంటి మార్పూ చేయలేదు.జూన్ నెలకుగాను అంతర్జాతీయ విమానాల జెట్ ఇంధన ధరను కిలోలీటరుకు సుమారు 400 డాలర్ల మేర చమురు సంస్థలు తగ్గించాయి. దీంతో కిలోలీటర్ 1100 డాలర్లకు చేరింది. ఈ తగ్గింపుతో అంతర్జాతీయ విమానాల ఇంధన ధరలు, దేశీయ విమాన ఇంధన ధరలు దాదాపు సమాన స్థాయికి చేరాయి. అంతర్జాతీయ విమాన ఇంధన ధర కిలో లీటరుకు రూ.1,05,000గా ఉండగా.. ప్రస్తుతం దిల్లీలో దేశీయ విమాన ఇంధన ధర కిలోలీటరుకు రూ.1,04,927గా ఉంది.అంతకుముందు దేశీయ విమానాలకు ఏప్రిల్ 1న కిలోలీటరుకు 25 శాతం అంటే రూ.15వేలు చొప్పున పెంచగా.. అంతర్జాతీయ విమాన సర్వీసుల ఏటీఎఫ్ ధరలు మాత్రం రూ.73 వేలు పెంచారు. మే నెలలో అంతర్జాతీయ విమానాలకు ఏటీఎఫ్ ధరను కిలో లీటరుకు 76 డాలర్లు పెంచి 1511 డాలర్లుకు చేర్చారు. దేశీయ విమానాల ధరల్లో అప్పుడు ఏ మార్పూ చేయలేదు. జూన్‌లో మాత్రం కిలో లీటరుకు 400 డాలర్లు తగ్గించడం గమనార్హం.

**విమాన సంస్థలకు పెద్ద ఊరట..** సాధారణంగా ఎయిర్‌లైన్స్ నిర్వహణ వ్యయంలో జెట్ ఫ్యూయల్‌కే 40 శాతం ఖర్చవుతుంది. ఇటీవలి పరిస్థితుల కారణంగా ఇది 5560 శాతానికి పెరిగింది. పెరిగిన చమురు ధరలకు తోడు, పశ్చిమాసియా యుద్ధ వాతావరణం వల్ల విమానాలు సుదీర్ఘమైన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ప్రముఖ విమానయాన సంస్థలు టికెట్ ధరపై సర్‌ఛార్జి విధించడం ప్రారంభించాయి. ఈ క్రమంలోనే ఎయిరిండియా జూన్‌ఆగస్టు మధ్య తన అంతర్జాతీయ విమాన సర్వీసులను 27 శాతం మేర తగ్గించింది. ఏటీఎఫ్ తగ్గింపు నిర్ణయం ఆయా సంస్థలకు ఊరట కలగనుంది.

# సోలార్ దిగుమతులపై నేటి నుంచి కొత్త రూల్స్..

## వినియోగదారులపై భారం



ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుందామని అనుకుంటున్నారా? అయితే, ఇకపై ఈ ప్రాజెక్ట్‌కు కాస్త ఎక్కువ ధర చెల్లించాల్సి రావొచ్చు. కొన్ని సోలార్ ప్రాజెక్ట్‌లకు దేశీయంగా తయారైన సోలార్ సెల్స్ మాత్రమే వినియోగించాలన్న నిబంధనను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడమే దీనికి కారణం. చైనా నుంచి దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సూర్యరశ్మిని విద్యుత్‌గా మార్చడంలో సోలార్ సెల్స్ కీలకం. సోలార్ ప్రాజెక్ట్‌లో పలు సెల్స్‌తో కూడిన ప్యానెళ్లు లేదా మాడ్యూళ్లను ఇంటిపై/బయట ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే పలు సోలార్ ప్రాజెక్టులకు దేశీయంగా తయారైన మాడ్యూళ్లనే వాడాలనే నిబంధనను కేంద్రం తీసుకొచ్చింది. తాజాగా పీఎం సూర్యఘర్ పథకం సహా వ్యాపారులు, పరిశ్రమలు వినియోగించే ఓపెన్‌యాక్సెస్ సోలార్ ప్రాజెక్టులకూ ఈ నిబంధనను విస్తరించింది. దీంతో జూన్ 1 నుంచి ప్రభుత్వ ఆమోదం పొందిన తయారీదారుల నుంచే మాడ్యూళ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

**ఎందుకీ నిర్ణయం...** దేశీయంగా సోలార్ తయారీ వ్యవస్థను బలోపేతం చేయాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం భారత్ సోలార్ ప్యానెళ్లను అసెంబుల్ చేయగలుగుతున్నప్పటికీ, వాటిలో వాడే సెల్స్ కోసం ఎక్కువగా చైనా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. దేశంలో ప్రస్తుతం ఏటా 50GW సోలార్ సెల్స్ అవసరం ఉండగా.. దేశ ఉత్పత్తి సామర్థ్యం కేవలం 2530 GW మాత్రమే ఉంటోంది. మిగతావి దిగుమతి చేసుకుంటున్నాం. ప్రభుత్వం తీసుకొచ్చిన 'దేశీయ' నిబంధన వల్ల మన దేశంలో సోలార్ సెల్స్ తయారీ కంపెనీలు ఎక్కువ పెట్టుబడులు పెట్టి, ఉత్పత్తిని పెంచుతాయని కేంద్రం భావిస్తోంది.

**వినియోగదారులపై భారం**

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ పెట్టుకునే వినియోగదారులపై భారం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దేశంలో తయారయ్యే సోలార్ సెల్స్ ధర, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వాటి కంటే ఎక్కువ. ఈ కారణంగా రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ ధర కిలోవాట్‌కు సుమారు రూ.3వేలు వరకు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. ఒకవేళ 5 కిలోవాట్ల సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ఆ మేర రూ.15వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. 'పీఎం సూర్యఘర్' పథకం కింద ఇచ్చే ప్రభుత్వ సబ్సిడీ యథాతథంగా కొనసాగినప్పటికీ.. ఇకపై అందుకు వాడిన ప్యానెళ్లు నిబంధనల ప్రకారం ఉన్నాయో లేదో తనిఖీ చేస్తారు. దేశీయంగా డిమాండ్‌కు సరిపడా సోలార్ సెల్స్ ఉత్పత్తి లేకపోవడం వల్ల తాత్కాలికంగా కొరత ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల చిన్న చిన్న సోలార్ కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ సవాళ్లు తాత్కాలికమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# క్రెడిట్ స్కోరు బాగున్నా.. రుణాలు తిరస్కరిస్తారు ఎందుకు?




క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉన్నవారికి వ్యక్తిగత రుణాలు త్వరగా లభిస్తాయని చాలా మంది భావిస్తుంటారు. అయితే, బ్యాంకుల వద్ద వ్యక్తిగత రుణం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు, రుణం లభిస్తుందా లేదా అనేది కేవలం మీ క్రెడిట్ స్కోర్‌పైనే ఆధారపడి ఉంటుందని భావిస్తే, మీరు బహుశా పొరబడినట్లే. రుణ తిరస్కరణకు క్రెడిట్ స్కోరే కాకుండా.. ఇతర కారణాలు కూడా ఉంటాయి. ఎందుకంటే, బ్యాంకుకు చెందిన క్రెడిట్ విభాగం స్కోరుతో పాటు అనేక ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది.

**వయసు...**

కొన్నిసార్లు, రుణం తిరస్కరణకు వయసు కూడా ఒక కారణం కావొచ్చు. సాధారణంగా, వయసుకు సంబంధించి పెద్దవారితో పోలిస్తే, ఉద్యోగ పదవీ కాలం ఎక్కువ ఉన్న యువకులకు/మధ్యస్థ వయసు వారికి రుణం పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు మీరు మరో రెండేళ్లలో పదవీ విరమణ చెందుతారని బ్యాంకు గ్రహించినప్పుడు, మీకు స్వల్ప కాలానికి మాత్రమే మెరుగైన ఆదాయం ఉంటుందని బ్యాంకు భావిస్తుంది. తర్వాత కాలంపై బ్యాంకులకు అనేక సందేహాలుంటాయి. కాబట్టి, బ్యాంకు తక్కువ సర్వీస్ ఉన్న వారికి రుణం ఇవ్వడానికి ఆసక్తి చూపవు. అంతేకాకుండా, పదవీ విరమణకు ముందు ఉండే వయసును బ్యాంకులు రిస్క్ ఏజ్‌గా కూడా పరిగణిస్తాయి. దురదృష్టవశాత్తు ఉద్యోగికి ఏమయినా అయితే, రుణ రికవరీ కష్టం అవుతుంది. అందువల్ల, బ్యాంకులు రుణం ఇచ్చేటప్పుడు ఎక్కువ జాబ్ సర్వీసు ఉన్నవారిపై మొగ్గు చూపిస్తాయి.

**స్థిరమైన ఆదాయం**

రుణ తిరస్కరణకు మరో కారణం స్థిరమైన ఆదాయం లేకపోవడం కూడా. స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు క్రెడిట్ స్కోరు బాగుండి, వ్యక్తిగత రుణ దరఖాస్తుకు అర్హులైనప్పటికీ, వారి ఆదాయం స్థిరంగా ఉండకపోవచ్చు. ఇంకా, బ్యాంకులో అందుబాటులో ఉన్న కొద్దిపాటి మూలధనం కోసం చాలా మంది రుణ దరఖాస్తుదారులు పోటీ పడుతున్నప్పుడు, బ్యాంకులు స్థిరమైన ఉద్యోగం/ఆదాయం లేని వారికి రుణాలు ఇవ్వడానికి సందేహిస్తాయి.మరికొన్నిసార్లు దరఖాస్తుదారుడికి స్థిరమైన ఉద్యోగం ఉన్నాసరే అతడి నెల ఆదాయం.. రుణ ఈఎంఐకి సమానంగానో లేదా మించో ఉన్నప్పుడు కూడా బ్యాంకులు రుణ దరఖాస్తును తిరస్కరిస్తాయి. బ్యాంకు నిర్దేశించిన కనీస ఆదాయ అర్హత కంటే మీ ఆదాయం తక్కువగా ఉంటే, రుణ సంస్థ రుణ అభ్యర్థనను తిరస్కరిస్తుంది. ఉదాహరణకు, చాలా బ్యాంకులు రుణ దరఖాస్తుదారుడి నెల నికర ఆదాయం రూ.25,000 కంటే ఎక్కువగా ఉంటే మేలని భావిస్తాయి. ఉద్యోగి ఔట్ సోర్సింగ్‌కు చెందినవారయినా కూడా బ్యాంకులు రుణం ఇవ్వడానికి వెనుకాడే అవకాశముంది. ఎందుకంటే, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సర్వీస్ ఎంత కాలం ఉంటుందో బ్యాంకులు సరిగ్గా అంచనా వేయలేవు.

**డాక్యుమెంట్స్**

రుణ దరఖాస్తుకు సపోర్టుగా దరఖాస్తుదారుడికి చెందిన సంబంధిత పత్రాలు కూడా చాలా అవసరం. ముఖ్యంగా, రుణానికి.. జీతం పే స్లిప్‌లతో పాటు, బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్లు, గుర్తింపు రుజువు వంటివి అవసరం పడతాయి. డాక్యుమెంట్ల పరిశీలన, ధ్రువీకరణ తర్వాత మాత్రమే వ్యక్తిగత రుణ దరఖాస్తు ఆమోదం జరుగుతుంది. అయితే, ఏదైనా వ్యక్తిగత డాక్యుమెంట్ లేకపోయినా లేదా వాటిలో తప్పులున్నా, పత్రాలలో పొంతన లేని సమాచారం ఉన్నా, మీ రుణ దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది.

**బహుళ రుణ దరఖాస్తులు**

కొంతమంది రుణం అత్యవసరమయినప్పుడు ఒకేసారి అనేక బ్యాంకులకు దరఖాస్తు చేస్తారు. ఇలాంటి సందర్భంలో ఆ బ్యాంకులు.. వారి క్రెడిట్ స్కోరును విడివిడిగా తనిఖీ చేస్తాయి. మీరు ఒకేసారి ఎక్కువ రుణ సంస్థలకు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారని క్రెడిట్ బ్యూరో నివేదికలో చూపిస్తుంది. ఇది మీరు బాగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లుగా పరిగణిస్తుంది. దీనివల్ల మీ ఆర్థిక విశ్వసనీయతపై సందేహాలు ఏర్పడి, మీ దరఖాస్తు తిరస్కరణకు దారితీయవచ్చు. కాబట్టి, మీ క్రెడిట్ స్కోరును సరిగ్గా చెక్ చేసుకుని, పూర్తి నమ్మకం ఏర్పడ్డాక మీకు అనువుగా ఉండే ఒక బ్యాంక్ నుంచి మాత్రమే వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసుకోవడం తెలివైన పని.

# ఆర్‌బీఐ నిర్ణయాలు.. యుద్ధ పరిణామాలే కీలకం



పశ్చిమాసియా యుద్ధ పరిణామాలు, జూన్ 5న వెలువడే ఆర్‌బీఐ పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలు, ముడిచమురు ధరలు, విదేశీ పెట్టుబడిదార్ల ధోరణి.. ఈవారం మన మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకాలు చేయకపోవడం, స్టాక్ మార్కెట్ల ఊగిసలాటకు దోహదం చేయొచ్చు. ఈనెల 35 తేదీల్లో జరిగే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరపతి విధాన కమిటీ సమావేశంలో వడ్డీరేట్లను సవరించక పోవచ్చనే విశ్లేషకులు భావిస్తున్నారు. 202526 జనవరిమార్చి, పూర్తి ఆర్థిక సంవత్సర జీడీపీ గణాంకాలు కూడా 5నే వెలువడనున్నాయి. మార్చి త్రైమాసికంలో 7.2%, పూర్తి ఆర్థికంలో 7.5% వృద్ధిరేటు నమోదు కావచ్చన్నది అంచనా. ఇవి కూడా సూచీలకు దిశా నిర్దేశం చేస్తాయి. స్పష్టమైన దిశ కనిపించే వరకు, మార్కెట్లలో అప్రమత్తత కొనసాగుతుందని బ్రోకరేజీలు చెబుతున్నాయి. విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) మే నెలలో రూ.32,963 కోట్ల అమ్మకాలు జరిపారు. ఈ ఏడాదిలో ఇప్పటికే వీరి విక్రయాలు రూ.2.25 లక్షల కోట్లకు చేరాయి. 2025 మొత్తంమీద అమ్మిన రూ.1.66 లక్షల కోట్ల కంటే ఈ మొత్తమే ఎక్కువ. నిఫ్టీ50 సూచీ 24,000 స్థాయిని అధిగమిస్తేనే సానుకూలతలు కనిపిస్తాయని, అంత వరకు ఒక శ్రేణికి లోబడే కదలాడొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ముడి చమురు ధరలు ఇంకా దిగి వస్తేనే విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు చేపడతారన్నది అంచనా. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లు నష్టపోవచ్చు. స్థూల ఆర్థిక మూలాలు స్థిరంగా ఉన్నా, వినియోగదారు విశ్వాసం బలహీనపడడం ఇందుకు కారణం.పశ్చిమాసియా యుద్ధానికి పరిష్కారం లభించే వరకు లోహ కంపెనీల షేర్లు ముఖ్యంగా ఫెర్రస్ సంబంధిత స్క్రిప్‌లు రాణించొచ్చు. సరఫరా ఆటంకాల వల్ల ఉక్కు ధరలు పెరుగుతూ ఉండడంతో కంపెనీల మార్జిన్లకు మద్దతు లభిస్తోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నుంచి రక్షించుకోవడానికి ఔషధ కంపెనీల షేర్లపై మదుపర్లు ఆసక్తి చూపొచ్చు. రాబోయే త్రైమాసికాల్లో దేశీయ విక్రయాలపై ఆధారపడే కంపెనీలు రాణించొచ్చు. నిఫ్టీ ఫార్మా సూచీ పడ్డపుడల్లా ట్రేడర్లు కొనుగోలు చేయొచ్చు. సిమెంటు కంపెనీల భవిష్యత్ అంచనాలు సానుకూలంగా ఉన్నా, సాంకేతిక చార్టుల్లో చూస్తే ఈ వారమూ నష్టపోవడానికే అవకాశాలున్నాయి. ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్ల కంటే తక్కువగానే ఉన్నందున, ఈ షేర్ల నష్టాలు పరిమితం కావొచ్చు. మే నెల టోకు విక్రయ గణాంకాలకు అనుగుణంగా వాహన కంపెనీల షేర్లు సోమవారం స్పందించొచ్చు. వాహనాలకు గిరాకీ స్థిరంగానే ఉంటుందన్నది అంచనా. ఇంధన, రవాణా వ్యయాలు, సరఫరా వ్యవస్థ ఆటంకాలు, కమొడిటీ ధరలనూ గమనించాలి.ముడి చమురు ధర తగ్గినా, దేశీయంగా ఇంధన మార్కెటింగ్ కంపెనీల షేర్లు విక్రయాల ఒత్తిడిలో కొనసాగొచ్చు. పెట్రో ఉత్పత్తుల రిటెయిల్ ధరలు, ఇప్పటికీ ఉత్పత్తి ధర కంటే తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. రాబోయే త్రైమాసికాల్లో ఈ కంపెనీలు నష్టాలను నమోదు చేస్తాయన్నది అంచనా.నిఫ్టీ బ్యాంక్ సూచీ ఒక శ్రేణిలోనే చలించొచ్చు. నాయకత్వం, నియంత్రణ విషయంలో ఉన్న ప్రశ్నల కారణంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు వెలుగులోకి రావొచ్చు. ప్రధాన వార్తలేమీ లేనందున టెలికాం షేర్లకు తటస్థం/సానుకూల అంచనాలనే విశ్లేషకులు వెలువరిస్తున్నారు. ఈ రంగ సూచీకి తక్షణ మద్దతు 3,500 వద్ద, నిరోధం 3,588 వద్ద కనిపిస్తోంది. యుద్ధ విరామ ఒప్పందంపై అనిశ్చితి కారణంగా, యంత్రపరికరాల కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. ఒప్పందం కుదిరితే ఈ రంగానికి సానుకూలతలు లభిస్తాయి. కమొడిటీ అధిక ధరల వల్ల కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి ఉంటుంది. ఐటీ షేర్లు కూడా ఒక శ్రేణిలోనే ట్రేడవవచ్చు.2 వారాలుగా కనిపిస్తున్న సానుకూలతలు కొనసాగుతాయని కొంత మంది, ప్రతికూల ధోరణికి అవకాశం ఉందని మరికొంత మంది విశ్లేషకులు అంటున్నారు.

## తెలుగులో మాట్లాడిన జాన్వీ.. 'జగదేక వీరుడు..' డైలాగ్‌తో నవ్వులు పంచిన బ్యూటీ



ప్రతి మనిషి జీవితానికి అర్థం ఏంటనేది కనుక్కోవడమే 'పెద్ది' మూవీ ఇచ్చే సందేశమని కథానాయిక జాన్వీకపూర్ (Janhvi Kapoor) అన్నారు. రామ్‌చరణ్ (Ram Charan) కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన మూవీ ఇది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకలో జాన్వీ తెలుగులో మాట్లాడి అలరించారు. ''మీరు చూపిస్తున్న ప్రేమకు చాలా సంతోషంగా ఉంది. 'పెద్ది'పైనా ఇలాంటి ప్రేమే చూపిస్తారని ఆశిస్తున్నా. అదే మాకు రోజూ కష్టపడి పనిచేయడానికి బలాన్ని ఇస్తుంది. మేము చేసే ప్రతి పని మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేయడానికే. నా జీవితానికి అర్థం అంటే.. మిమ్మల్ని (ప్రేక్షకులు) అలరించడమే. మేము చేసిన ఈ మూవీ బాగా నచ్చుతుందని ఆశిస్తున్నా. ఈ మూవీలో నటించే అవకాశం ఇచ్చిన చిత్ర బృందానికి ధన్యవాదాలు' అని జాన్వీ అన్నారు. ఈ సందర్భంగా జగదేకవీరుడు అతిలోక సుందరిలోని శ్రీదేవి చెప్పిన 'మానవ.. ఒక్కసారి నీ వామహస్తమును నాకు అందించి నన్ను ఆదుకొనవా' అన్న డైలాగ్‌లోను వేదికపై చెప్పి నవ్వులు పూయించారు.

## ఇన్‌స్టాలో వచ్చే వాటిలో 90 శాతం అబద్ధాలే: బాబీ దేవోల్



వరుస సినిమాలతో టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు బాలీవుడ్ నటుడు బాబీ దేవోల్. ప్రస్తుతం ఆయన అలియా భట్ 'ఆల్ఫా' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభం నుంచి అలియాతో ఆయనకు (Bobby Deol) విభేదాలు వచ్చాయని ఇటీవల రూమర్స్ మొదలయ్యాయి. తాజాగా ఈ ప్రచారంపై బాబీ దేవోల్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. ''ఈ ప్రచారానికి సంబంధించిన ఓ స్క్రీన్‌షాట్‌ను నాకు షేర్ చేశారు. అది చూసి ఆశ్చర్యపోయా. జనాలు ఎంత ఖాళీగా ఉన్నారో అది చూశాక అర్థమైంది. నేను రణ్‌బీర్ కపూర్‌తో కలిసి 'యానిమల్' చేశా. ఇప్పుడు అలియాతో కలిసి చేస్తున్నా. వాళ్లిద్దరూ నాకు ఎంతో ఇష్టమైన నటీనటులు. ముఖ్యంగా అలియా (Alia Bhatt) చాలా కష్టపడుతోంది. యాక్షన్ సన్నివేశాల కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుని సిద్ధపడుతోంది. మేమంతా ఇంత ప్రశాంతంగా పని చేసుకుంటుంటే ఇలాంటి రూమర్స్ ఎందుకు రాస్తారో అర్థం కావడం లేదు. పైగా నా కోపాన్ని తగ్గించడం కోసం ఆదిత్య చోప్రా నాకు మరో సినిమా ఆఫర్ చేశారని కూడా రాశారు. ఇలా రూమర్స్ సృష్టించిన వారందరికీ నేను నిజాలు నిరూపించలేను కదా..! ఇన్‌స్టాలో వచ్చే 90 శాతం వార్తలు అబద్ధాలే ఉంటాయి'' అని బాబీ దేవోల్ అన్నారు.అలియా భట్, శార్వరీ వాఘ్ ప్రధాన పాత్రల్లో 'ఆల్ఫా' (Alpha) చిత్రం తెరకెక్కుతోంది. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ చిత్రాన్ని ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. శివ్ రావేల్ దర్శకత్వం వహిస్తున్నారు. జులై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో అనిల్ కపూర్, బాబీ దేవోల్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

## విజయ్‌ను 'లక్కీ మ్యాన్' అంటోన్న ఫ్యాన్స్..



**తమిళనాడు కొత్త సీఎంగా చరిత్ర సృష్టించారు విజయ్. ఆయనను ఇప్పుడు కోలీవుడ్ ఫ్యాన్స్ 'లక్కీ మ్యాన్' అని పిలుస్తున్నారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసిన దగ్గర నుంచి తమిళ సినిమాలు హిట్ అవుతున్నాయని తెగ పొగిడేస్తున్నారు. విజయ్ (Vijay) సీఎం అయ్యాక తమిళ చిత్ర పరిశ్రమ జాతకమే మారిపోయిందంటూ పోస్ట్‌లు పెడుతున్నారు.ఎన్నో రోజులుగా హిట్ కోసం ఎదురుచూసిన సూర్య ఇటీవల 'కరుప్పు'తో బ్లాక్‌బస్టర్‌ను అందుకున్నారు. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం (Karuppu) మే 15న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సూర్య కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఇప్పటి వరకూ రూ.300 కోట్లు వసూళ్లు చేసింది. దీంతో సూర్య.. తన చిత్రబృందంలోని కొందరికి ఖరీదైన కార్లు కూడా బహుమతిగా అందించారు. ఈ సినిమా స్పెషల్ షోలకు విజయ్ అనుమతి ఇవ్వడం వల్లే ఇంత భారీ వసూళ్లు సాధ్యమయ్యాయని కొందరు పోస్ట్‌లు పెడుతున్నారు.ఇక, అర్జున్, ప్రీతీ ముకుందన్, అభిరామి ప్రధానపాత్రల్లో నటించిన 'బ్లాస్ట్' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో కోలీవుడ్‌కు వరుసగా రెండు హిట్ సినిమాలు రావడంతో విజయ్‌ను అభిమానుల లక్కీ మ్యాన్ అంటున్నారు. జూన్ 5న రానున్న 'పరిమళ అండ్ కో' కూడా హిట్ పక్కా అని నమ్మకంగా చెబుతున్నారు.**

# థియేటర్స్ లో 'పెద్ది' హవా .. ఓటీటీలో యాక్షన్ హంగామా మిస్సవ్వొద్దు

సంక్రాంతి తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమలో ఆశించిన చిత్రాలేవీ రాలేదు. ఆ లోటును భర్తీ చేయడానికి సిద్ధమయ్యాడు 'పెద్ది' (Peddi Movie). రామ్‌చరణ్ కథానాయకుడి బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీకపూర్ కథానాయిక. ఏఆర్ రెహమాన్ సంగీతం (peddi songs) అందించారు. ఇప్పటికే ప్రచార చిత్రాలతో ఆసక్తిని పెంచిన ఈ మూవీ జూన్ 4న (Peddi release date) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకరోజు ముందుగానే జూన్ 3న (peddi premiere show) రాత్రి 8గంటలకు ప్రీమియర్ షోలతోనూ సందడి చేయనుంది. ఏపీలో ఇప్పటికే ఇందుకు సంబంధించిన అనుమతులు రాగా, తెలంగాణలో ఏం జరుగుతుందో చూడాలి. పెద్ది రన్ టైమ్ (Peddi run time) సుమారు మూడు గంటలపైనే ఉంటుందని టాక్. పాన్ ఇండియా మూవీగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లోవిడుదలవుతుండటంతో థియేటర్స్ అన్నీ 'పెద్ది' నామస్మరణతో మార్మోగనున్నాయి.

**ఓటీటీలో యాక్షన్ హంగామా..**

ఇండియన్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించిన 'ధురంధర్: ది రివెంజ్' (Dhurandhar: The Revenge) భారత్‌లో ఓటీటీ ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. 'జియో హాట్‌స్టార్' వేదికగా జూన్ 5 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. జూన్ 4న రాత్రి 7 గంటలకు డిజిటల్ ప్రీమియర్ ప్రదర్శించనున్నారు. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా అందుబాటులో ఉండనుంది. మిగిలిన దేశాల్లో సినీ అభిమానులు ఈ మూవీని 'నెట్‌ఫ్లిక్స్' (Dhurandhar 2 OTT) వేదికగా చూడొచ్చు.

మలయాళ అగ్ర హీరోలు మమ్ముట్టి (Mammootty), మోహన్‌లాల్ (Mohanlal) కలిసి నటించిన సినిమా 'పేట్రియాట్' (Patriot Movie). ఈ మూవీ 'జీ 5' (Zee 5) వేదికగా జూన్ 5 (Patriot Movie Streaming date) నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు ఆడియో కూడా అందుబాటులో ఉండనుంది. దేశభక్తితో కూడిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. నయనతార, ఫహాద్ ఫాజిల్ లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషించారు.

నటుడు అర్జున్ మేనల్లుడు ధ్రువ్ సర్జా హీరోగా నటించిన యాక్షన్ చిత్రం 'కేడీ: ది డెవిల్' (KD The Devil). యాక్షన్ ప్రియులను అలరించిన ఈ మూవీ 'జీ 5' (Zee 5)లో జూన్ 5 (KD The Devil OTT Release date) నుంచి స్ట్రీమింగ్ కానుంది. కన్నడ, తెలుగు, తమిళం, మలయాళంలో భాషల్లో అందుబాటులోకి రానుంది. రీష్మా హీరోయిన్ కాగా సంజయ్ దత్, శిల్పాశెట్టి తదితరులు కీలక పాత్రలు పోషించారు.



**ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యే మరికొన్ని చిత్రాలు/సిరీస్‌లు**

నెట్‌ఫ్లిక్స్
29 (మూవీ) తమిళం/తెలుగు జూన్ 5
మా బెహన్ (మూవీ) జూన్ 4
ఆఫీస్ రొమాన్స్(మూవీ) జూన్ 5
ద మార్క్‌డ్ ఉమెన్ (మూవీ) జూన్ 5
ద బ్లడ్ సిస్టర్స్ (మూవీ) జూన్ 5
మెక్సికో 86 (మూవీ) జూన్ 5

అమెజాన్ ప్రైమ్
ద లెజెండ్ ఆఫ్ ఓక్స్ మెషీనా (మూవీ) జూన్ 3
క్లార్క్‌సన్స్‌ఫార్మ్ సీజన్ 5 (వెబ్‌సిరీస్) జూన్ 3

యాపిల్ టీవీ
కేప్ ఫియర్ (మూవీ) జూన్ 5

# సినీ ప్రియులకు గుడ్‌న్యూస్.. హైదరాబాద్‌కు ఐమ్యాక్స్ వచ్చేస్తోంది

హైదరాబాద్: తెలుగు సినీ ప్రియులకు గుడ్‌న్యూస్. ఒకప్పుడు తెలుగు ప్రేక్షకులకు అద్భుతమైన వినోదాన్ని పంచిన ఐమ్యాక్స్ ఫార్మాట్ మళ్లీ అందుబాటులోకి రాబోతోంది. దాదాపు పుష్కరకాలం తర్వాత భాగ్య నగర వాసుల కలను ఏఎంబీ సినిమాస్ సాకారం చేయబోతోంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. ఏఎంబీ సినిమాస్, సురేశ్ ప్రొడక్షన్స్, ఐమ్యాక్స్‌లు సంయుక్తంగా ఐమ్యాక్స్ స్క్రీన్‌ను (imax screen in hyderabad) ఏర్పాటు చేయబోతున్నాయి. 'ఏఎంబీ క్లాసిక్ విక్టరీ' పేరుతో సుదర్శన్ 70లో ఇది అందుబాటులోకి రానుంది.




**ఏ ఐమ్యాక్స్ వస్తుంది?**

హైదరాబాద్‌లో ఐమ్యాక్స్ ఏర్పాటు ప్రకటన సినీ అభిమానులకు ఆనందం కలిగించేదే. అయితే ఏ ఫార్మాట్‌ను తీసుకొస్తారనేది ఇప్పుడు అసలు ప్రశ్న. ఫ్లాట్ ఐమ్యాక్స్ స్క్రీన్ అయితే 1.90:1 రేషియోలో ఉంటుంది. ఇక ట్రూ ఐమ్యాక్స్, దీనినే ఐమ్యాక్స్ జీటీ (గ్రాండ్ థియేటర్) అంటారు. దీని రేషియో 1:43:1. విదేశాల్లో ఈ తరహా స్క్రీన్‌లు ఉన్నాయి. మనదేశంలో అహ్మదాబాద్ సైన్స్ సిటీలో మాత్రమే ట్రూ ఐమ్యాక్స్ ఉంది. మరి ఇప్పుడు హైదరాబాద్‌లో సుదర్శన్ 70లో రాబోయే 'ఏఎంబీ క్లాసిక్ విక్టరీ'లో ఏ రేషియోతో స్క్రీన్ ఏర్పాటు చేస్తారనేది ఆసక్తికరం. అలాగే ఎప్పుడు ప్రారంభమవుతుంది? సీటింగ్ కెపాసిటీ తదితర వివరాలు తెలియాలంటే ఇంకొంత కాలంగా ఆగాల్సిందే! వచ్చే ఏడాది 'వారణాసి', 'స్పిరిట్', 'డ్రాగన్', 'రాకా' వంటి భారీ చిత్రాలు రాబోతున్నాయి. 'వారణాసి' కీలక సన్నివేశాలన్నీ ట్రూ ఐమ్యాక్స్‌లో ఉంటాయని రాజమౌళి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఐమ్యాక్స్ ఏర్పాటుపై 'వారణాసి' టీమ్ కూడా స్పందించింది. 'ఏప్రిల్ 7న 'వారణాసి'ని హైదరాబాద్‌లోని ఐమ్యాక్స్‌లో ఆస్వాదించండి' ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది.

**స్పెషల్ స్క్రీన్‌లకు కేరాఫ్ హైదరాబాద్..**

దేశంలోని ఇతర మెట్రో నగరాలకు దీటుగా హైదరాబాద్ టెక్నాలజీ హబ్‌గా మారింది. అత్యున్నత సాంకేతికత కలిగిన స్క్రీన్‌లు భాగ్యనగరంలో వినోదాన్ని పంచుతున్నాయి. ముఖ్యంగా అల్లు సినిమాస్‌లో ఏర్పాటు చేసిన అతి పెద్ద డాల్బీ విజన్ స్క్రీన్ తెలుగు రాష్ట్రాల్లో నిర్మించిన మొదటి డాల్బీ థియేటర్. ఇక ఏఆర్‌టీ సినిమాస్, AAAలో EPIQ స్క్రీన్ + డాల్బీ సౌండ్ సిస్టమ్ సినీ ప్రేక్షకుడికి అద్భుతమైన అనుభూతిని ఇస్తున్నాయి. వీటితో పాటు పిక్సెల్ ఫార్మాట్, 4Dx కలిగిన స్క్రీన్‌లు ప్రేక్షకులకు వినోదం పంచుతున్నాయి. ఐమ్యాక్స్ లేదన్న లోటు త్వరలో తీరనుంది. వీటితో పాటు, ఇప్పటివరకూ హాలీవుడ్‌కే పరిమితమైన మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ కూడా ఇటీవల నగరంలో అందుబాటులోకి వచ్చింది. అన్నపూర్ణా స్టూడియోస్, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా ఈ సాంకేతికతను తెచ్చాయి. 'వారణాసి'లోకి కీలక సన్నివేశాలను కూడా ఇక్కడ షూట్ చేయడం మరో విశేషం.

## ఖల్‌నాయక్ సీక్వెల్‌లో జాకీష్రాఫ్



బాలీవుడ్ సీనియర్ నటులు సంజయ్ దత్, జాకీ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో మరోసారి తెరపై సందడి చేయనున్నారు. వీరిద్దరి కాంబోలో 1993లో వచ్చిన హిట్ చిత్రం 'ఖల్‌నాయక్'. ఈ సినిమా సీక్వెల్‌ని ఈ ఏడాది ఆరంభంలోనే 'ఖల్‌నాయక్ రిటర్న్స్' టైటిల్‌తో అధికారికంగా ప్రకటించారు సంజయ్. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో జాకీ.. ఈ సీక్వెల్‌లో మళ్లీ సంజయ్‌తో కలిసి నటించడం ఆనందంగా ఉందని వెల్లడించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నారని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి తాను దర్శకుడు సుభాష్ ఘూయ్, సంజయ్‌లతో చర్చలు చేశానని అన్నారు. సుభాష్ ఘూయ్ తెరకెక్కించిన మొదటి చిత్రంలో సంజయ్ దత్, జాకీ ష్రాఫ్, మాధురీ దీక్షిత్ నటించారు.

# చికాకుగా అనిపించినా.. వాస్తవమిదే! ..మాధురి దీక్షిత్



''మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశమిస్తున్నారా?'' అంటూ సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేస్తున్న వారిపై మండిపడ్డారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురి దీక్షిత్. ఆమె, కథానాయిక త్రిప్తి దిమ్రీ, ధర్ణ దుర్గా ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మా బెహెన్'. ఈ నెల 5న ఓటీటీ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలోనే మాధురి, త్రిప్తి ఓ ఇంటర్వ్యూలో సామాజిక మాధ్యమాల్లో నటీమణులపై వస్తున్న ట్రోల్స్ గురించి తమ వ్యక్తిగత అభిప్రాయాల్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ... ''ఐశ్వర్య 20 ఏళ్లుగా కేన్స్ చిత్రోత్సవాలకు హాజరవుతున్నారు. దేశం మొత్తానికి గర్వ కారణంగా నిలిచిన వ్యక్తి ఆమె. అలాంటి ఆమెను దుస్తులు, ఆకృతి లాంటి ఇతరత్రా వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకుని మరి వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా చేసి ఆమె స్థాయిని తగ్గించలేరు. అలాంటి వ్యక్తులపై ట్రోల్స్ చేసేవారు నేటి యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో గ్రహించాలని అనుకుంటున్నాను. మీ విలువ మీ రూపం పై ఆధారపడి ఉంటుంది, విజయాలపై కాదు అనే సందేశం ఇస్తున్నారా? ఇది పూర్తిగా తప్పుదోవ పట్టించే సందేశం. ఇది వరకు కూడా ఇలాంటివి ఉండేవి కానీ, ఇప్పుడు ప్రతి చిన్న విషయాన్ని కంటెంట్‌గా మార్చుతున్నారు. ఇది కొంచెం చికాకుగా అనిపించినా.. నేటి వాస్తవమిదే'' అన్నారు.త్రిప్తి మాట్లాడుతూ.. ''ఇంట్లో కూర్చుని ఇతరులపై వ్యాఖ్యలు చేయడం చాలా సులభం. కానీ, వారి స్థానంలో ఉండి ఆలోచిస్తే దాని వెనుక పడిన కష్టం గురించి తెలుస్తుంది. అనన్య లేదా ఐశ్వర్య అయినా.. వారిద్దరూ తమ జీవితంలో చాలా కష్టపడ్డారు. ఏదైనా ఒక పని కోసం మన సమయం, శ్రమని వెచ్చించినప్పుడు దాని ఫలితం విషయంలో కొంచెం భయం ఉంటుంది. సినిమా విడుదలకు ముందు ఇంతే. ప్రేక్షకులు కూడా డబ్బులు చెల్లించి మీ పనిని చూస్తున్నారు. కాబట్టి అది వారికి నచ్చకపోతే దానిపై వ్యాఖ్యానించే హక్కు ఉంటుంది. కానీ, ఆ విషయం కాకుండా దాన్ని మరేదైనా విషయంతో ముడిపెట్టినప్పుడు అది నాకు చికాకు కలిగిస్తుంది'' అని అంది త్రిప్తి.

# ఇద్దరూ ఇద్దరే..





**ఇండియన్ ప్రిమియర్ లీగ్‌లో ఇంకో సీజన్ గడిచిపోయింది. ఈసారి ఉత్కంఠభరిత పోరాటాలు తగ్గిపోయాయి. ప్లేఆఫ్స్‌లో ఏకపక్ష మ్యాచ్‌లు నీరసం తెప్పించాయి. ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ లాంటి మేటి జట్లు తీవ్రంగా నిరాశపరిచాయి. రోహిత్ శర్మ సహా భారీ అంచనాలు పెట్టుకున్న స్టార్ ఆటగాళ్లు చాలామంది మెరవలేదు. ధోని బరిలోకే దిగలేదు.**

**కానీ ప్రతికూలతలు ఎన్నున్నప్పటికీ.. ఇద్దరు ఆటగాళ్లు అద్భుత ఆటతీరుతో అభిమానులను అలరించారు. ప్రతిసారీ భారీ అంచనాలతో బరిలోకి దిగే దిగ్గజ ఆటగాడు విరాట్ కోహ్లి 38వ పడికి చేరువ అవుతూ కూడా కుర్రాళ్లతో పోటీ పడుతూ పరుగుల వరద పారించి తనకు తానే సాటి అనిపించాడు. అదే సమయంలో విరాట్ వయసులో సగం కూడా లేని వైభవ్ సూర్యవంశీ.. మేటి ఆటగాళ్లను వెనక్కి నెడుతూ ఈ సీజన్లో నంబర్‌వన్ బ్యాటర్‌గా, ఐపీఎల్‌లో కొత్త సూపర్‌స్టార్‌గా అవతరించాడు.**

**వయసు, అనుభవం, ఆటతీరులో పూర్తి భిన్నమైన ఈ ఇద్దరూ.. ఈ ఏడాది లీగ్‌పై బలమైన ముద్ర వేసి ఐపీఎల్ ఆకర్షణ కోల్పోకుండా చూశారు.**

ఐపీఎల్ అంటేనే కుర్రాళ్ల మెరుపులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే టోర్నీ. సీనియర్లలో కూడా కొందరు బాగా ఆడుతుంటారు కానీ.. ఆధిపత్యం కుర్రాళ్లదే అవుతుంటుంది. వినూత్నమైన షాట్లతో యువ ఆటగాళ్లు చెలరేగిపోతుంటారు. రేంజ్ హిట్టింగ్, స్కూప్‌లు, రివర్స్ స్వీప్‌లతో అలవోకగా పరుగులు రాబడుతుంటారు కుర్రాళ్లు. సీజన్ సీజన్‌కూ దూకుడు పెరుగుతున్న టోర్నీలో సంప్రదాయ షాట్లు ఆడే ముందు తరం బ్యాటర్లకు మనుగడ కష్టమైపోతోంది. కానీ కోహ్లి మాత్రం ఇప్పటికీ తన ప్రత్యేకతను చాటుకుంటూనే ఉన్నాడు. 37 ఏళ్ల వయసులోనూ కుర్రాళ్లకు ఏమాత్రం తీసిపోని రీతిలో, ఇంకా చెప్పాలంటే వాళ్లను మించి రాణించాడు విరాట్. 16 మ్యాచ్‌లు.. 675 పరుగులు.. 56.25 సగటు.. ఒక శతకం, 5 అర్ధశతకాలు.. అత్యధిక స్కోరు 105 నాటౌట్.. ఇవీ ఈ సీజన్లో కోహ్లి గణాంకాలు. వీటిని బట్టే కోహ్లి ఎంత గొప్ప ప్రదర్శన చేశాడో అర్థం చేసుకోవచ్చు. అత్యధిక పరుగుల వీరుల్లో కోహ్లి నాలుగో స్థానం సాధించాడు. 19 సీజన్లుగా ఒకే జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ అతనెలా పరుగుల వరద పారిస్తున్నాడో అభిమానులు చూస్తూనే ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగుల (9336) వీరుడు అతనే. ఒక సీజన్లో అత్యధిక పరుగులు (973, 2016లో) సాధించిన ఘనతా అతడిదే. అత్యధిక శతకాలు (9), అర్ధశతకాలు (68), ఫోర్లు (844).. ఇలా ఎన్నో రికార్డులు విరాట్ సొంతం. అత్యధికసార్లు (7) ఒక సీజన్లో 500 పరుగుల మార్కు దాటిన ఆటగాడూ అతనే. కరోనా సమయంలో ఫామ్ కోల్పోయి రెండు మూడు సీజన్లు కాస్త ఇబ్బంది పడ్డాడు కానీ.. మళ్లీ పుంజుకుని ఎప్పట్లాగే పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ సీజన్లో కోల్‌కతాపై ఛేదనలో అతను అజేయ సెంచరీ సాధించడం విశేషం. క్వాలిఫయర్‌లో 43 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడిన విరాట్.. ఫైనల్లో 75 పరుగుల చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. స్ట్రైక్‌రేట్‌పై విమర్శలకు చెక్‌పెడుతూ ఈ సీజన్లో కోహ్లి 165.84 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం విశేషం. గుజరాత్‌తో ఫైనల్లో 25 బంతుల్లో అర్ధసెంచరీ కొట్టి అవసరమైతే ఎంత వేగంగా అయినా ఆడగలనని చాటాడు. ఒక ఎండ్‌లో కోహ్లి స్థిరంగా ఆడుతుంటే.. అవతలి ఎండ్‌లో వెంకటేశ్ అయ్యర్, పడిక్కల్, పాటీదార్ లాంటి విధ్వంసక బ్యాటర్లు చెలరేగడానికి అవకాశం దక్కింది. ఈ వయసులోనూ వికెట్ల మధ్య పరుగులో, ఫీల్డింగ్‌లో విరాట్ చూపించిన చురుకుదనం యువ క్రికెటర్లకు ఒక స్ఫూర్తి పాఠమే. ఇక మైదానంలో కోహ్లి చూపించే ఉత్సాహం సహచరులకే కాదు.. అభిమానులకూ ఎంత ఎనర్జీనిస్తుందో చెప్పేదేముంది? విరాట్ ఎక్కడికి వెళ్లినా స్టేడియాలు ఎలా నిండిపోతాయో తెలిసిందే. ఇలా లేటు వయసులోనూ లీగ్‌కు విరాట్ తెస్తున్న విలువే వేరు.అంతా అతడికోసం..

కోహ్లి, రోహిత్, బుమ్రా, హార్దిక్, శుభ్‌మన్ లాంటి టీమ్‌ఇండియా స్టార్లు ఎంతోమంది ఐపీఎల్‌లో ఉన్నా వాళ్లందరినీ మించి ఈ సీజన్లో అభిమానుల దృష్టిని ఆకర్షించింది వైభవ్ సూర్యవంశీనే అనడంలో సందేహం లేదు. గత ఏడాది 14 ఏళ్ల వయసులో వైభవ్ ఐపీఎల్‌లో అడుగుపెట్టినపుడు.. అతణ్ని టోర్నీలో ఆడించడమే గొప్ప అనుకున్నారంతా! కానీ 35 బంతుల్లోనే సెంచరీ కొట్టి ఔరా అనిపించిన ఈ ఎడమ చేతి వాటం బ్యాటర్.. ఆ ప్రదర్శన గాలివాటం కాదని చాటుతూ ఈ సీజన్లో లీగ్‌పై తిరుగులేని ముద్ర వేశాడు. ప్రతి బంతికీ సిక్స్ బాదాలన్నట్లు, ఎప్పుడెప్పుడు ఔటైపోతాడా అన్నట్లు ఆడే బ్యాటర్.. సీజన్ ముగిసేసరికి అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా నిలవడం అనూహ్యమే. 16 మ్యాచ్‌ల్లో 48.5 సగటుతో అతను 776 పరుగులు సాధించాడు. అందులో ఒక శతకం, 5 అర్ధశతకాలు ఉన్నాయి. తన స్ట్రైక్ రేట్ 237.3 కావడం విశేషం. లీగ్ చరిత్రలోనే ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా ఒక సీజన్లో 72 సిక్సర్లు బాదిన ఘనత వైభవ్ సొంతం. లీగ్ దశలో సన్‌రైజర్స్‌పై అతను 15 బంతుల్లో అర్ధ శతకం, 36 బంతుల్లోనే శతకం సాధించడం విశేషం. ఇదే జట్టుపై ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ చెలరేగిన తీరు అసామాన్యం. కేవలం 28 బంతుల్లోనే 97 పరుగులు చేసి 13 ఏళ్లుగా నిలిచి ఉన్న ఐపీఎల్ వేగవంతమైన శతకం రికార్డు (గేల్, 30 బంతుల్లో)ను బద్దలు కొట్టేలా కనిపించాడు సూర్యవంశీ. కానీ తర్వాతి బంతికి ఔటైపోవడంతో రికార్డు చేజారింది. కానీ వైభవ్ దూకుడు చూస్తుంటే.. గేల్ రికార్డును ఇంకెంతో కాలం నిలవనిచ్చేలా లేడు. ఆరెంజ్ క్యాప్‌తో పాటు అనేక అవార్డులు కూడా అందుకున్న అతను.. భవిష్యత్తులో ఐపీఎల్‌లో, టీమ్‌ఇండియా తరఫున మరెన్నో ఘనతలు అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. స్కూలుకెళ్లే వయసున్న పిల్లాడు.. మహా మహా బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ మంచినీళ్ల ప్రాయంగా సిక్సర్లు బాదిన వైనం చాన్నాళ్లు గుర్తుండిపోతుంది. వైభవ్‌ను అడ్డుకోవడానికి తమ దగ్గర మూడు రకాల వ్యూహాలున్నాయని పేర్కొన్న సన్‌రైజర్స్ కెప్టెన్.. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆ కుర్రాడి చేతిలో ఊచకోతకు గురైన తీరును అభిమానులు మరిచిపోలేరు. ఇంకా చాలామంది ప్రపంచ స్థాయిబౌలర్లు వైభవ్‌కు చెక్ పెట్టబోయి విఫలమయ్యారు. బంతిని ఎదుర్కొనేటపుడు చేతి, కంటి సమన్వయంతో శరవేగంగా స్పందించే తీరు.. తన బ్యాట్ వేగం సచిన్ సహా దిగ్గజ ఆటగాళ్లను కూడా ఆశ్చర్యపరిచింది. మ్యాచ్ మ్యాచ్‌కూ మెరుగుపడుతూ లీగ్ చివరికి వచ్చేసరికి అందరు అభిమానుల దృష్టిని తన వైపు తిప్పుకున్న వైభవ్.. వచ్చే ఏడాది భారీ అంచనాల మధ్య ఐపీఎల్ బరిలోకిది దిగబోతున్నాడు. ఈలోపే అతను సచిన్ కంటే చిన్న వయసులో టీమ్‌ఇండియాకు ఆడినా ఆశ్చర్యం లేదు.

**అలా కూడా ఆడగలనని..**

క్రీజులో ఉన్నంతసేపూ వైభవ్‌కు బాదడమే తెలుసని, అతను పరిస్థితులకు తగ్గట్లు నిలిచి ఆడలేడనే అభిప్రాయం ఉండేది కొన్ని రోజుల ముందు వరకు. కానీ గుజరాత్‌తో రెండో క్వాలిఫయర్‌లో.. అవతలి ఎండ్‌లో క్రమం తప్పకుండా వికెట్లు పడుతుంటే.. తన వికెట్‌కు విలువనిస్తూ పట్టుదలతో క్రీజులో నిలిచాడు. 18వ ఓవర్ వరకు క్రీజులో ఉన్నాడు. మామూలుగా అప్పటిదాకా ఉంటే వైభవ్ డబుల్ సెంచరీ కొట్టేయగలడు. కానీ ఆ మ్యాచ్‌లో సెంచరీ కూడా కొట్టలేదు. అలా అని మరీ నెమ్మదిగా ఏమీ ఆడలేదు. 200 స్ట్రైక్ రేట్ నమోదు చేశాడు. పదేపదే బౌన్సర్లు సంధిస్తే తట్టుకున్నాడు.. మంచి బంతులను గౌరవించాడు. కొన్ని వినూత్నమైన షాట్లు ఆడి సిక్సర్లు సాధించాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ చూపించిన పరిణతి.. అతడిలో మేటి బ్యాటర్ ఉన్నాడని చాటిచెప్పింది.

# ఐసీసీ కొత్త రూల్స్..

## మ్యాచ్‌ల మధ్యలో టీమ్‌ను కోచ్‌లు కలవచ్చు

అంతర్జాతీయ క్రికెట్‌లో మార్పులు చేసేందుకు ఐసీసీ (ICC) శ్రీకారం చుట్టింది. టెస్టులను మరింత ఆకర్షణీయంగా మార్చేలా ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో ఐసీసీ క్రికెట్ కమిటీ ఛైర్మన్ సౌరభ్ గంగూలీ కూడా పాల్గొన్నారు.

ఈ మార్పులు అక్టోబరు 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఇప్పటివరకు డే టెస్టుల్లో రెడ్ బాల్‌తో ఆడేవారు. ఇక నుంచి టెస్టు మ్యాచ్‌లో తక్కువ వెలుతురు ఉన్న సందర్భంలో ఇరు జట్ల అంగీకారంతో మ్యాచ్ మధ్యలోనే రెడ్ బంతికి బదులు పింక్ బాల్ వాడొచ్చు. ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించేందుకు ఐసీసీ బోర్డు ఆమోదం తెలిపింది. ప్రతికూల పరిస్థితుల్లో మ్యాచ్ జరిగే సమయం పెంచేలా ఈ చర్య ఉపయోగపడుతుంది.షెడ్యూల్ చేసిన డ్రింక్స్ విరామ సమయంలో హెడ్ కోచ్‌లు లేదా వారి ప్రతినిధులు ఆటగాళ్లతో సంప్రదించడానికి అనుమతించింది. టీ20 మ్యాచ్‌ల్లో 15 నిమిషాల విరామాలను ఐసీసీ తప్పనిసరి చేసింది. ఆట తిరిగి ప్రారంభమైనప్పుడు బ్యాటర్లు సిద్ధంగా ఉండాలని సూచించింది. వెలుతురు లేమి పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రస్తుతం వినియోగిస్తున్న లైట్ మీటర్ విధానం విషయంలో కొత్త సూచనలను అంగీకరించింది. బౌలింగ్ తీరుపై అభ్యంతరాలు వ్యక్తమైతే యాక్షన్‌ను గుర్తించేందుకు మ్యాచ్ అధికారులు హాక్‌ఐ డేటాను వినియోగించేందుకు ఆమోదం తెలిపింది. లెగ్ సైడ్ వైడ్స్ విషయంలో ప్రయోగాత్మకంగా తీసుకొచ్చిన మార్పులను పూర్తి స్థాయిలో అమలు చేయనుంది. మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ 2027 నిర్వహణ విండోలో మార్పునకు బోర్డు ఆమోదం తెలిపింది. జూన్ జులై నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 28 తేదీలకు మార్చింది.ఐదు సభ్య దేశాలు.. ఐదు అసోసియేట్ సభ్య దేశాలతో ఐసీసీ మహిళల ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీ 2026ని నిర్వహించనున్నారు.

# ఈసారి సంబరాల్లేవ్..



**అహ్మదాబాద్:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు నిరాశ. ఆదివారం రెండో ఐపీఎల్ టైటిల్ గెలిచిన నేపథ్యంలో.. సొంత నగరం బెంగళూరులో ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు గానీ, సంబరాలు నిర్వహించడం లేదని ఆర్సీబీ ఫ్రాంచైజీ తెలిపింది. భద్రత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

కర్ణాటకలోని లోక్‌భవన్‌లో నూతన ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం కూడా బెంగళూరు నిర్ణయానికి ఓ కారణం. "బెంగళూరులో ఎలాంటి కార్యక్రమాలు ఉండబోవు. ఆ ప్రాంతంలో పలు నిబంధనలు అమల్లో ఉన్నాయి. మేం వాటికి కట్టుబడి ఉండాలనుకుంటున్నాం'' అని ఆర్సీబీ వర్గాలు తెలిపాయి. గత ఏడాది ట్రోఫీ చేజిక్కించుకున్న తర్వాత ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ 11 మందికి ఈ ట్రోఫీ అంకితం... పాటీదార్: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటీదార్ ఐపీఎల్ ట్రోఫీని మరణించిన అభిమానులకు అంకితం ఇచ్చాడు "విజయానంతరం అభిమానులను కోల్పోవడం మమ్మల్ని బాధించింది. వాళ్లు ఫ్యాన్స్ మాత్రమే కాదు.. కుటుంబ సభ్యులు కూడా'' అని పాటీదార్ తెలిపాడు.

# వచ్చేస్తోంది .. కిక్కిస్తుంది

**ఫిఫా ప్రపంచకప్ మరో 9 రోజుల్లో**

**ప్రపంచంలో అత్యంత జనరంజక ఆట ఏది అంటే.. నిస్సందేహంగా ఫుట్‌బాలే. దీనికున్న ఆదరణ అంతా ఇంతా కాదు. అత్యంత సంపన్న దేశాల్లోనూ, అతి పేద దేశాల్లోనూ ప్రజలు సాకర్ అంటే పడి చస్తారు. దాదాపు అన్ని దేశాల్లోకి ఈ ఆట చొచ్చుకెళ్లింది. మన దేశంలో తక్కువే కావొచ్చు.. కానీ చాలా దేశాల్లో పిల్లలు గల్లీల్లో ఫుట్‌బాల్ ఆడుతూ కనిపిస్తారు. చిన్న చిన్న టోర్నీలనైనా ప్రజలు ఎగబడి చూస్తారు. అలాంటిది నాలుగేళ్లకోసారి వచ్చే ప్రపంచకప్ అంటే.. ఇక చెప్పక్కర్లేదు. ఇప్పుడు ఫుట్‌బాల్ ప్రపంచానికి వరల్డ్‌కప్ జ్వరం పట్టుకుంది. కిక్కిచ్చే టోర్నీ కోసం ఆత్రంగా ఎదురుచూస్తోంది. అమెరికా, మెక్సికో, కెనడా వేదికలుగా ఈ నెల 11 నుంచే విశ్వసంబరం!**

ఓ మెస్సి.. ఓ రొనాల్డో.. ఓ ఎంబాపె.. ఓ యమాల్.. అభిమానులను మంత్రముగ్ధుల్ని చేయడానికి సిద్ధమవుతున్నారు. ఓ బ్రెజిల్.. ఓ ఫ్రాన్స్.. ఓ జర్మనీ.. ఓ అర్జెంటీనా.. ఓ స్పెయిన్.. టోర్నీని రసవత్తరంగా మార్చడానికి సై అంటున్నాయి. ఈ ఫిఫా ప్రపంచకప్ ఎంతో ప్రత్యేకమైంది. గత టోర్నీ వరకు 32 జట్లే పోటీపడగా.. ఈసారి ఏకంగా 48 జట్లు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. మ్యాచ్‌ల సంఖ్య 64 నుంచి 104కు పెరిగింది. ఈసారి ప్రపంచకప్‌లో మరింత వినోదం గ్యారెంటీ.

**ఫార్మాట్ ఇలా..**

ప్రపంచకప్‌లో 48 జట్లు పోటీపడుతున్నాయి. వాటిని గ్రూపునకు నాలుగు జట్ల చొప్పున 12 గ్రూపులు (ఎ నుంచి)గా విభజించారు. గ్రూప్‌లో ప్రతి జట్టు ఇంకో జట్టుతో ఒకసారి తలపడుతుంది. ప్రతి గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు, మూడో స్థానంలో నిలిచిన జట్లలో ఎనిమిది అత్యుత్తమమైనవి నాకౌట్‌కు అర్హత సాధిస్తాయి. ఈ 32 జట్ల నుంచి 16 ముందజ వేస్తాయి. అందులో నుంచి ఎనిమిది జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంటాయి.

**ఈ జట్లు తొలిసారి..**

తొలిసారి ఫిఫా ప్రపంచకప్‌నకు అర్హత సాధించి నాలుగు దేశాలు చరిత్ర సృష్టించాయి. కేప్ వెర్డ్, కురసావ్, జోర్డాన్, ఉజ్బెకిస్థాన్‌తో 2026 ప్రపంచకప్ అరంగేట్రం చేయనున్నాయి. టోర్నీ జట్ల సంఖ్యను పెంచడం ఈ దేశాలకు కలిసి వచ్చింది. ఆతిథ్య దేశం హోదాలో కిందటిసారి తొలిసారి ప్రపంచకప్‌లో ఆడే అవకాశం దక్కించుకున్న ఖతార్.. ఈసారి క్వాలిఫయింగ్ ద్వారా అర్హత సాధించింది. కల్లోల ఇరాక్ కూడా ప్రపంచకప్‌నకు క్వాలిఫై అయింది. ఆ జట్టు చివరి స్థానాన్ని (48వ) సొంతం చేసుకుంది. 1986 తర్వాత ఇరాక్ ఫిఫా ప్రపంచకప్‌లో ఆడడం ఇదే తొలిసారి.

**ఆసియా నుంచి..**

ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య నుంచి మొత్తం 8 జట్లు ప్రపంచకప్‌లో పోటీపడుతున్నాయి. ఆస్ట్రేలియా, ఇరాన్, జపాన్, జోర్డాన్, ఉజ్బెకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియాలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. వీటిలో జపాన్‌కు అత్యుత్తమ ఫిఫా (18వ) ర్యాంకు ఉంది.

**ఇటలీ మళ్లీ..**

ఒకప్పటి మేటి జట్టు ఇటలీ వరుసగా మూడోసారి ఫిఫా మెగా టోర్నీకి అర్హత సాధించడంలో విఫలమైంది. ఓ మాజీ ఛాంపియన్ వరుసగా మూడు సార్లు ప్రపంచకప్‌నకు దూరం కావడం ఇదే తొలిసారి. ఇటలీ ఫుట్‌బాల్ అభిమానులకు ఇది ఎంతో వేదన కలిగించే విషయమే. ఆ జట్టు నాలుగుసార్లు 1934, 1938, 1982, 2006లో విశ్వవిజేతగా నిలిచింది.






**టోర్నీ ఇలా..**

ప్రపంచకప్‌నకు అమెరికా, మెక్సికో, కెనడా ఉమ్మడిగా ఆతిథ్యమిస్తున్నాయి. మూడు దేశాలు కలిసి ప్రపంచకప్‌ను నిర్వహించడం ఇదే తొలిసారి. అమెరికాలో 11, మెక్సికోలో మూడు, కెనడాలో రెండు నగరాలు మెగా టోర్నీకి వేదికలు. ప్రతి దేశంలో తొలి మ్యాచ్‌కు ముందు ప్రారంభోత్సవం జరుగుతుంది. 2026 ప్రపంచకప్ తొలి మ్యాచ్ (మెక్సికో × దక్షిణాఫ్రికా) మెక్సికో సిటీలో జరుగుతుంది. ఫైనల్‌కు జులై 19న న్యూయార్క్ న్యూజెర్సీ స్టేడియం ఆతిథ్యమిస్తుంది. మూడు ప్రపంచకప్ (1970, 1986, 2026)లకు ఆతిథ్యమిచ్చిన తొలి దేశంగా మెక్సికో చరిత్ర సృష్టించనుంది. 2026 ప్రపంచకప్‌లో ఫైనల్ సహా అత్యధిక మ్యాచ్‌లకు అమెరికా ఆతిథ్యమివ్వనుంది.

# దివ్యాంశి పసిడి చరిత్ర

ప్రిస్టినా: భారత టేబుల్ టెన్నిస్ యువ క్రీడాకారిణి దివ్యాంశి భౌమిక్ ప్రపంచ వేదికపై సత్తాచాటింది. భారత్ తరఫున డబ్ల్యూటీటీ ఫీడర్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన పిన్న వయస్కురాలిగా ఈ 15 ఏళ్ల అమ్మాయి చరిత్ర సృష్టించింది. సోమవారం మహిళల సింగిల్స్ ఫైనల్లో దివ్యాంశి 32 (8-11, 11-8, 11-5, 7-11, 11-7)తో యి తియాన్ (చైనీస్ తైపీ)పై అద్భుత విజయాన్ని అందుకుంది. ప్రపంచంలోనే ఈ టైటిల్ గెలిచిన రెండో పిన్న వయస్కురాలిగానూ ఘనత సాధించింది. దివ్యాంశి మహిళల డబుల్స్‌లోనూ పసిడి గెలిచింది. ఉత్కంఠగా సాగిన పోరులో ఆమె.. సిండ్రెలా దాస్ కలిసి 32 (7-11, 14-12, 12-14, 1-18, 1-17)తో సాచి ఓకి, కొకొనా మురామత్సు (జపాన్) జోడీపై విజయం సాధించారు.



# RCB బ్యాటర్‌పై సస్పెన్షన్ వేటు



ఆర్సీబీ బ్యాటర్ టిమ్ డేవిడ్‌పై వేటు పడింది. ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌లో లెవల్ 1 ఉల్లంఘన చేసినందుకు గాను బీసీసీఐ అతడికి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించింది. 2 డీమెరిట్ పాయింట్లు అతడి ఖాతాలో వేసింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టిమ్ డేవిడ్ అంపైర్ నితిన్ మీనన్ వైపు ఐస్ బ్యాగ్‌ను ప్రమాదకరంగా విసిరినట్లు తేలింది. డేవిడ్ తన తప్పును ఒప్పుకొని, మ్యాచ్ రెఫరీ జవగల్ శ్రీనాథ్ విధించిన శిక్షను అంగీకరించాడు. ఇప్పటికే అతడి ఖాతాలో 3 డీమెరిట్ పాయింట్లు ఉన్నాయి. ప్రస్తుతం మొత్తంగా 5 పాయింట్లకు చేరడంతో 2027లో ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటు పడింది. వచ్చే సంవత్సరం ఆర్సీబీ మొదటి మ్యాచ్‌ను టిమ్ డేవిడ్ ఆడలేడు.